ఆదివారం
29-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 128
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

విజయవాడలో మరో పాస్‌పోర్టు కార్యాలయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విజయవాడ కేంద్రంగా త్వరలో మరో రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు కానున్నట్లు రీజనల్ పాసుపోర్టు ఆఫీసర్ శివ హర్ష తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాస్ పోర్టు సేవా కేంద్రానికి అదనంగా బందర్ రోడ్డులో మరో కేంద్రం ఏర్పాటవుతుందన్నారు. ప్రస్తుతం విజయవాడలోని రీజినల్ పాస్‌పోర్టు సేవా కేంద్రానికి రోజుకి 2వేల అప్లికేషన్లు వస్తున్నాయని తెలిపారు. విజయవాడ రీజనల్ ఆఫీసు కేంద్రంగానే ఇకపై పాస్‌పోర్టు ప్రింటింగ్ ప్రారంభ అవుతుందన్నారు. మరో కార్యాలయం ఏర్పాటు వల్ల మరింత త్వరగా సేవలు అందుతాయని హర్ష తెలిపారు.

అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధ కూటమి

పరాజయం

ఐరాసలో వీగిపోయిన కెనడా సవరణ ప్రతిపాదన

ఇజ్రాయిల్-హమాస్ సంధికి పిలుపునిస్తూ తీర్మానం

- మద్దతిచ్చిన 120 దేశాలు
- వ్యతిరేకించిన 14 దేశాలు
- ఓటింగ్‌కు భారత్ దూరం
- ఇజ్రాయిల్‌కు పరోక్ష మద్దతు

జెనీవా: గాజాపై ఇజ్రాయిల్ దండయాత్రను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఆక్షేపించాయి. తక్షణమే దాడులను ఆపాలని, గాజాకు మానవతా సాయాన్ని అందజేయాలని నొక్కిచెప్పాయి. ఇదే అంశమై ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సర్వసభ్య సమావేశం (యూఎన్‌జీఏ)లో సమగ్రంగా చర్చలు జరిగాయి. దాదాపు అన్ని దేశాలు పలస్తీనా పక్షాన్నే నిలిచాయి. దీంతో ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులతో రక్తసిక్తమైన గాజాకు తక్షణ నైతిక ఓదార్పు లభించినట్లు అయింది. ఫలితంగా ఇజ్రాయిల్-అమెరికా యుద్ధ కూటమి ఓడిపోయింది.

గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులతో విరుచుకుపడుతున్న వేళ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో పలస్తీనాకు అనుకూలంగా తీర్మానం ప్రవేశపెట్టారు. మానవతా దృక్పథంతో వెంటనే దాడులను విరమించాలని ఇజ్రాయిల్‌కు సూచిస్తూ... సంధికి పిలుపునించేలా తీర్మానం ఉంది. కనీస సౌకర్యాలు లేక అల్లాడుతున్న గాజా ప్రజలకు మానవతా

- మిగతా 2 లో

అమెరికా సామ్రాజ్యవాదానికి

తలొగ్గిన భారత్

ఐరాసలో గాజా తీర్మానానికి మద్దతివ్వకపోవడం ఆక్షేపణీయం

సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు రాజా, ఏచూరి విమర్శ

న్యూఢిల్లీ: గాజాలో ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులు, మారణహోమాన్ని తక్షణమే ఆపాలని సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరీ డిమాండ్ చేశారు. పలస్తీనాలో పౌరహత్యలకు, యుద్ధ నేరాలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పలస్తీనాకు మానవతా సాయానికి అనుకూలంగా ఐక్యరాజ్య సమితి తీర్మానించడాన్ని స్వాగతించారు. ఈ తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉండటాన్ని తీవ్రంగా ఆక్షేపించాయి. పలస్తీనాకు భారత్ దీర్ఘకాలంగా మద్దతిస్తోందని, సంప్రదాయానికి భిన్నంగా ఇజ్రాయిల్‌కు పరోక్ష మద్దతిచ్చేలా ఐరాసలో మోదీ ప్రభుత్వం వ్యవహరించిందని

- మిగతా 2 లో

సీపీఐ కార్యాలయంపై

దాడి

తమిళనాడులో ఘటన : నలుగురి అరెస్టు

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని టీ నగర్ ప్రాంతంలోగల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యాలయం 'బలన్ ఇల్లం'పై రాళ్లు, మద్యం సీసాలతో దాడి జరిగింది. మద్యం మత్తులో ఉన్న నలుగురు కుర్రాళ్లు కార్యాలయం ప్రహరి గోడ వద్ద నుంచి భవనం వెనుక భాగంలో మద్యం సీసాలు, రాళ్లు విసిశారు. ఈ ఘటనలో నలుగురిని పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెట్టినట్లు పార్టీ శనివారం ఓ ప్రకటన చేసింది. సీపీఐ కార్యాల యంపై దాడిని సీపీఎం, ఎండీఎంకే, ఏఐడీఎంకే పార్టీలు ఖండించాయి. 'కార్యాలయ ప్రాంగణంలో మేము మాట్లాడు కుంటున్నప్పుడు ముందు రాళ్లు ఆపై మద్యం సీసాలు వచ్చి పడ్డాయి. ఇది ప్రణాళికాబద్ధంగా జరిగిన దాడి. దుండగులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి' అని పోలీసు లకు సీపీఐ ఫిర్యాదు చేసింది. పోలీసులు సత్వరమే స్పందించి దర్యాప్తు చేపట్టి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురిని విచారించి నలుగురిని అరెస్టు చేశారని పార్టీ ప్రకటన పేర్కొం ది. చిన్న విషయంలో గొడవ పడిన ఆ నలుగురు రాళ్లు, సీసాలు విసిరారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. సీసీటీవీ ఫుటేజి ఆధారంగా పోలీసుల దర్యాప్తు సాగిందని, ఎం.ఆలెక్స్ (22), పి.భరత్ (20), ఎస్.నాగరాజ్ (22), బి.పార్తిబన్ (21)ను అరెస్టు చేశారన్నారు. ఈ నలుగురు నేరచరితులు కాదని, వీరిలో ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు కాగా మిగతా ఇద్దరు చిరు ఉద్యోగులని పోలీసులు వెల్లడించారు.

చివరి కౌన్సెలింగ్ ఉంటుందా?

- విద్యార్థులు ఎదురు చూపు
- ప్రతి ఏటా ఏపీ ఈఏపీసెట్ జాప్యం
- పొరుగు రాష్ట్రాలకు విద్యార్థులు
- 27,590 పైగా సీట్లు మిగులు
- 69 శాతమే భర్తీ !

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ ఈఏపీ సెట్-2024 మూడో విడత (చివరి) వెబ్ కౌన్సెలింగ్ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ కౌన్సెలింగ్ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. అసలు మూడో విడత కౌన్సిలింగ్ ఉంటుందా?, లేదా? అనేది గందరగోళంగా మారింది. ప్రతి ఏటా రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల్ని ఏపీ ఈఏపీ సెట్ ద్వారా భర్తీ చేస్తారు. అందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా కేటగిరీల వారీగా సీట్ల భర్తీ ప్రక్రియ ఉంటుంది. దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ చాలా ఆలస్యంగా కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. అనేక ఏళ్లుగా ఇదే సమస్య ఎదురవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యా

- మిగతా 2 లో

కరువు మండలాలు ప్రకటించి ఆదుకోండి

- బ్యాంకు రుణాలు రద్దుచేసి, కొత్త రుణాలివ్వాలి
- సామాజిక పెన్షన్లు రూ. 6 వేలకు పెంచాలి
- సీపీఐ రాష్ట్ర సమితి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వర్షాభావ పరిస్థితులు, సాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ ప్రణాళిక అమల్లో ప్రభుత్వ వైఫల్యం ఫలితంగా వ్యవసాయరంగంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తక్షణమే కరవు మండలాలుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్‌లో సిహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన రెండు రోజులపాటు జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ జాతీయ రాజకీయ పరిస్థితులను గురించి వివరించగా, రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పార్టీ భవిష్యత్ కార్యాచరణ వివరించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు. సమావేశం ఈ దిగువ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది.

కరువు మండలాలు ప్రకటించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి

రాష్ట్రంలో కరువు తీవ్రరూపం దాల్చింది. అన్ని జిల్లాలు అత్యల్ప వర్షం కేటగిరిలో మొగ్గుతున్నాయి. మొత్తం ఖరీఫ్ సీజన్‌లో 29.8శాతం లోటు వర్షపాతం నమోదైంది. 18 జిల్లాల్లోని 440 మండలాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు 40 మండలాలకు పైగా తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నాయి. మరో పక్క ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, వెలిగోడు, సోమశీల, కండలేరులో గత సంవత్సరం అక్టోబరు 25 నాటికి 807.69 టీఎంసీల నీటి నిల్వలు ఉంటే ప్రస్తుతం 343.41 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. తీవ్ర వర్షాభావం, ప్రాజెక్టుల నీటిమట్టం, భూగర్భజల నీటిమట్టం తగ్గిపోవటంతో పంటలు ఎండిపోయి రైతాంగం దిగుబడులపై ఆశలు వదులుకున్నారు. మరోవైపు విద్యుత్ కోతలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో సైతం సాగునీరందక వరి తదితర పైర్లు ఎండిపోవడం జరుగుతున్నది. ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 34.39 లక్షల హెక్టార్లుకాగా సాగైంది 24.98 లక్షల హెక్టార్లు మాత్రమే. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు కూలీలు పెద్ద ఎత్తున వలసలు పోతున్నారు. వందలాది గ్రామాల్లో త్రాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన మరియు జలవనరుల శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రత్నామ్యాయ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కరువు మండలాలు ప్రకటించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్న కనీస విజ్ఞత రాష్ట్ర ప్రభుత్వానికి కొరవడింది. తక్షణం రాష్ట్రంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితుల నుంచి రైతాంగాన్ని, గ్రామీణ పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వెంటనే రాజకీయ పక్షాలు, రైతుసంఘాలతో సమావేశం నిర్వహించి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించాలనీ,

- మిగతా 2 లో

బ్యాంకు ఉద్యోగుల చర్చల్లో

పురోగతి

- 15 శాతం వేతనం పెంపునకు ఐబీఏ సుముఖం
- మెరుగైన వేతనాలు కోరుతున్న యూనియన్లు
- త్వరలో మరో దఫా చర్చలు

న్యూఢిల్లీ : బ్యాంకు ఉద్యోగులకు వేతన పెంపుతో పాటు వారానికి ఐదు రోజుల పని విధానం త్వరలో అమలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో బ్యాంకు ఉద్యోగ సంఘాలు గురువారం జరిపిన చర్చలలో కొంత పురోగతి కనిపించింది. ఉద్యోగుల జీతాలు 15 శాతం పెంపుదలకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ప్రతిపాదించింది. అయితే ఇతర మార్పులతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పలకరించాల్సిన అవసరం లేదయ్యా.. మొన్నే ఓటరుగా వాడిని తొలగించాం!

ఉన్నత విద్యకు

విదేశీ బాట

- ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- వారిలో తెలుగు వారే అధికం

న్యూఢిల్లీ: ఉన్నత విద్య కోసం విదేశాల బాట పడుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. అత్యధికంగా విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్యలో పంజాబ్, తెలంగాణ, మహారాష్ట్ర ముందువరుసలో ఉన్నాయి. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్లే విద్యార్థులలో తెలుగు రాష్ట్రాల వారు ఎక్కువ మంది ఉన్నారని తాజా సర్వేలో వెల్లడైంది. భారతీయ విద్యార్థులకు నచ్చిన గమ్యస్థానాల జాబితాలో అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాలు టాప్‌లో ఉంటే వీటి సరసన జర్మనీ, కిర్గిస్తాన్,

- మిగతా 2 లో

బీజేపీకి గెలుపు దూరమే!

చత్తీస్‌గఢ్‌లో ఆ 9 స్థానాల్లో ఇప్పటి వరకు గెలవని వైనం

రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కాషాయ పార్టీ దుస్థితి

ఈసారి పోటాపోటీగా బరిలోకి అభ్యర్థులు... ముమ్మర ప్రచారం

8 లో

చత్తీస్‌గఢ్ ఏర్పాటయిన నాటి నుంచి బీజేపీ ఇంకా విజయం సాధించని తొమ్మిది అసెంబ్లీ స్థానాలు మిగిలే ఉన్నాయి. రాష్ట్రాన్ని 15 ఏళ్లుగా బీజేపీ పరిపాలించింది. అయితే 2000లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తొమ్మిది నియోజకవర్గాల్లో ఎన్నడూ విజయం నమోదు చేయలేకపోయింది. ఈ పరిస్థితి తొలగిపోతుందనే ఆశతో పార్టీ వీటిలో ఆరు స్థానాలకు కొత్త ముఖాలను ఎంపిక చేసింది. చత్తీస్‌గఢ్‌లో నవంబరు 7, 17 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది.

విశాలాంధ్ర

ప్రపంచం

2

ఆదివారం

29 అక్టోబరు 2023

గాజాను బతకనివ్వండి

మా పేరుతో దాడులు వద్దు: తక్షణమే ఆపేయండి

అమెరికాలోని యూదుల డిమాండ్

న్యూయార్క్ గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్‌లో వెయ్యిమంది నిరసన

న్యూయార్క్: 'గాజాను బతకనివ్వండి... మా పేరుతో దాడులు వద్దు... తక్షణమే వాటిని ఆపేయండి' నినాదాలు న్యూయార్క్‌లోని గ్రాండ్ సెంట్రల్ టర్మినల్ వద్ద మార్మోగాయి. నల్ల వస్త్రాలు ధరించి వెయ్యి మంది యూదులు 'నాట్ ఇన్ అవర్ నేమ్' (మా పేరుతో దాడులు వద్దు) అన్న బ్యానర్లతో 'జూయిష్ వాయిస్ ఆఫ్ పీస్' అధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలస్తీనాకు సంఘీభావం ప్రకటించారు. ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులను తీవ్రంగా ఖండించారు. మూడు వారాలుగా గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ తీవ్రరూపం దాల్చిన తర్వాత అమెరికాలో ఇంత భారీ నిరసన జరగడం ఇదే మొదటిసారి. మ్యాన్‌హాటన్ పట్టణం నడిబొడ్డున ఉన్న గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్ నిరసనకారులతో కిటకిటలాడింది. మా పేరుతో రక్తపాతం వద్దు, తక్షణమే కాల్పులు ఆపండి, గాజాను బతకనివ్వండి వంటి నినాదాలు చేశారు. బ్యానర్లు ప్రదర్శించారు. 'పలస్తీనాను స్వతంత్రంగా ఉండనివ్వండి, కాల్పుల విరమణకు ఇజ్రాయిలీలు డిమాండ్ చేస్తున్నారు. యుద్ధంపై నాకు నమ్మకం లేదు' వంటి బ్యానర్లు కూడా ప్రదర్శించారు. అమెరికాలో అత్యధిక జనాభా కోరుకుంటున్నది బైడెన్ ప్రభుత్వం చేయాలని నిరసనకారులు కోరారు. బాంబుల వర్షం ఆగాలనే నిరసన తెలుపుతున్నామన్నారు. నిరసనకారులను గ్రాండ్ సెంట్రల్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకునేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. ప్రదర్శనకారులు కదం వెళుతుంటే పోలీసులు చూస్తూ ఉండిపోయారు. శుక్రవారం రాత్రి 7 గంటలప్పుడు స్టేషనలో వందలాది మంది ఉండగా వారిని అక్కడ నుంచి పంపివేసేందుకు పోలీసులు యత్నించారు. ఇదే క్రమంలో భారీగా అరెస్టులు జరిగాయి. సుమారు 300 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు నిర్వాహకులు అంచనా వేశారు. కానీ పోలీసులు ధ్రువీకరించలేదు.

మలేసియాకు కొత్త సుల్తాన్

కౌలాలంపూర్: మలేసియాకు 17వ రాజుగా సుల్తాన్ ఇబ్రహీం సుల్తాన్ ఇస్కాందర్ నియమితులయ్యారు. జోహర్ సుల్తాన్‌కు పదవీ బాధ్యతలను అప్పగించనున్నట్లు మలేసియా రూలర్స్ కాన్ఫరెన్స్ ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 31న సుల్తాన్ ఇబ్రహీం అధికారికంగా బాధ్యతలు స్వీకరిస్తారు. సుల్తాన్ అబ్దుల్లా సుల్తాన్ అహ్మద్‌షా తదుపరి రాజముద్ర వినియోగాధికారం సుల్తాన్ ఇబ్రహీంకు ఉంటుందని అధికారిక ప్రకటన తెలిపింది. అలాగే సుల్తాన్ నజ్రీన్ షాను డిప్యూటీ యాంగ్ డి పెర్టాన్ ఆగాంగ్‌గా ఐదేళ్ల పదవీకాలం కోసం నియమించారు. ఈయన పెరక్‌కు సుల్తాన్. కాగా ఇబ్రహీం 1958లో జన్మించారు. 2010 నుంచి సింగపూర్ సరిహద్దులోని జోహర్ రాష్ట్రాన్ని పాలించారు. మలేసియా రాచరిక దేశం. తొమ్మిది మంది సుల్తాన్లు/పాలకులు అధికార బాధ్యతలు నిర్వర్తిస్తారు. మతపెద్దలుగానూ వ్యవహరిస్తారు. ఐదేళ్ల పదవీకాలంలో ఒకరి తర్వాత ఒకరు రాజుగా బాధ్యతలు స్వీకరిస్తారు.

150 హమాస్ అండర్‌గ్రౌండ్ లక్ష్యాలు ధ్వంసం: ఐడీఎఫ్

టెల్ అవీవ్: ఉత్తర గాజాలో అర్ధరాత్రి లక్షిత దాడులను ఇజ్రాయిల్ సైన్యం ముమ్మరం చేసింది. ట్యాంకర్లను లక్షిత ప్రాంతాలకు పంపి, దాడులు చేయిస్తోంది. సముద్రం, గగనతలం, భూమి మీద నుంచి గాజాపై ఇజ్రాయిల్ భీకరంగా దాడులు చేస్తోంది. తాజా లక్షిత దాడుల్లో 150 అండర్‌గ్రౌండ్ లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం శనివారం ప్రకటించింది. హమాస్‌కు సంబంధించిన సొరంగాలు, అండర్‌గ్రౌండ్ స్థావరాలు, యుద్ధక్షేత్రాలే లక్ష్యంగా దాడులు జరిపినట్లు తెలిపింది. ఈనెల 7వ తేదీన ఇజ్రాయిల్‌పై దాడుల్లో కీలకంగా వ్యవహరించిన అసీమ్ అబు రకాబా సహా ఐదుగురు హమాస్ కమాండర్లను మట్టుబెట్టినట్లు ఐడీఎఫ్ వేరొక ప్రకటన చేసింది.

గాజాలో జర్నలిస్టుల భద్రతకు హామీనివ్వలేం

రాయిటర్స్, ఏఎఫ్‌పీకి ఇజ్రాయిల్ సైన్యం స్పష్టీకరణ

జెరూసలేం: గాజా స్ట్రిప్‌లో పనిచేస్తున్న జర్నలిస్టుల భద్రతకు తాము హామీనివ్వలేమని అంతర్జాతీయ వార్తాసంస్థలు రాయిటర్స్, ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్‌కు ఇజ్రాయిల్ సైన్యం ఓ లేఖ ద్వారా స్పష్టంచేసింది. 22 రోజులుగా గాజాపై ఇజ్రాయిల్ భీకరంగా దాడులు జరుపుతున్న క్రమంలో జర్నలిస్టులు, వారి కుటుంబాలు ప్రాణాలు కోల్పోతుండటంపై పాత్రికేయుల రక్షణ కోరుతూ ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్)కు రెండు అంతర్జాతీయ వార్తా సంస్థలు విన్నవించాయి. గాజాలో విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని రాయిటర్స్, ఏఎఫ్‌పీ కోరాయి. తాజాగా అల్‌జజీరా బ్యూరో చీఫ్ వార్తాసేకరణలో ఉన్న సమయంలో ఆయన కుటుంబంలోని సుమారు 17 మంది ఇజ్రాయిల్ దాడుల్లో మృత్యువాత పడిన విషయం విదితమే.

అయితే జర్నలిస్టులకు భద్రత విషయంలో తాము ఎలాంటి హామీ ఇవ్వలేమని ఐడీఎఫ్ వెల్లడించింది. గాజావ్యాప్తంగా హమాస్ స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నట్లు తెలిపింది. హమాస్ కావాలనే సైనిక స్థావరాలను జర్నలిస్టులు, పౌరులు ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్నదని ఐడీఎఫ్ ఆరోపించింది. హమాస్ లక్ష్యాలపై హై-ఇంటెన్సిటీ దాడులు జరుపుతున్నామని, వీటి ధాటికి పక్క భవనాలు దెబ్బతింటాయని పేర్కొంది. కొన్నిసార్లు హమాస్ రాకెట్లు కూడా గాజా ప్రాంతాల్లో పడి ప్రజలను చంపేయవచ్చని తెలిపింది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగుల భద్రతకు హామీ ఇవ్వమంటే కుదరదని ఐడీఎఫ్ స్పష్టం చేసింది. అయితే అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని మాత్రం తాము బలంగా సూచించగలమని మాత్రం లేఖ వెల్లడించింది. ఐడీఎఫ్ లేఖపై రాయిటర్స్ స్పందిస్తూ తమతో పాటు ఇంకెన్ని వార్తా సంస్థలకు ఇలాంటి లేఖలు ఐడీఎఫ్ నుంచి అందాయో తాము ధ్రువీకరించలేమని పేర్కొంది.

బ్యాంకు ఉద్యోగుల చర్చల్లో పురోగతి

(మొదటిపేజీ తరువాయి)

పాటు మరింత గణనీయమైన పెంపుదల కోసం యూనియన్లు ఒత్తిడి చేస్తున్నాయని నివేదికలు పేర్కొంటున్నాయి. చర్చలు మరో దఫా జరగనున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకులు, దీర్ఘకాలంగా స్థిరపడిన ప్రైవేట్ రంగ బ్యాంకులు తమ సిబ్బందికి సుమారుగా 15 శాతం జీతాల పెంపు కోసం చర్చలు జరుపుతున్నాయి. సమీప భవిష్యత్తులో ఐదు రోజుల పనివారాన్ని కూడా అమలు చేయాలని యోచిస్తున్నాయని ఒక ఆంగ్ల పత్రిక కథనం పేర్కొంది. ప్రత్యేకించి పీఎస్‌బీ వంటి కొన్ని బ్యాంకులు వేతన పెంపు కోసం అధిక కేటాయింపులు చేయడం ప్రారంభించాయి. సెప్టెంబరు త్రైమాసికంలో 10 శాతం పెరుగుదల కోసం బడ్జెట్‌ను రూపొందించడానికి బదులుగా, ఢిల్లీ కేంద్రంగా ఉన్న ఈ బ్యాంకు 15 శాతం పెరుగుదలకు నిధులను కేటాయించింది. అయితే, అంతకంటే ఎక్కువ వేతనం పెంచాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నట్లు తెలిసింది. కోవిడ్ సమయంలోనూ అవిశ్రాంతంగా సేవలందించడం, ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయడంతో పాటు ఇటీవలి కాలంలో బ్యాంకుల లాభాలు పెరిగిన నేపథ్యంలో ఈ మేర ఉద్యోగులకు మెరుగైన వేతన పెంపు కోసం ఉద్యోగ సంఘాలు పట్టుబడుతున్నాయి. దీనిపై త్వరలో నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు ఐదు రోజుల పని విధానం గురించి ప్రభుత్వానికి ఇండియన్ బ్యాంకింగ్ అసోసియేషన్ (ఐబీఏ) ఇది వరకే ప్రతిపాదనలు పంపింది. దీనికి ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్‌బీఐ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. ఇప్పటికే ఎల్ఐసీలో 5 రోజుల పని విధానం అమలవుతోంది. దీంతో బ్యాంకులు, ఉద్యోగ సంఘాలు ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చాయి. ప్రస్తుతం బ్యాంకులకు రెండో, నాలుగో శనివారం సెలవు దినంగా ఉంది. ఒకవేళ కొత్త పని విధానానికి ఆమోదం లభిస్తే.. బ్యాంకులు కేవలం వారంలో ఐదు రోజులు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయి.

అవయవ దానంతో నలుగురికి ప్రాణదానం

విశాలాంధ్ర-విజయవాడ: తాను చనిపోతూ ఆ యువకుడు నలుగురికి ప్రాణదానం చేశాడు. కృష్ణా జిల్లా చినముత్తేవికి చెందిన 22 ఏళ్ల గారపాటి జయప్రకాశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయినట్టు ధ్రువీకరించారు. వెంటనే విజయవాడలోని ఆయుష్ ఆస్పత్రి వైద్యులు శనివారం బాధితుడి కుటుంబసభ్యులతో మాట్లాడారు. వైద్యుల విజ్ఞప్తి మేరకు.. జీవన్‌దాన్ కింద అవయవాలు దానం చేసేందుకు వారు ముందుకొచ్చారు.

దీంతో గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి వేర్వేరు ప్రాంతాల్లోని మూడు ఆస్పత్రులకు జయప్రకాశ్ గుండె, కాలేయం, మూత్రపిండాలను తరలించినట్లు ఆయుష్ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ వై. రమేష్ బాబు తెలిపారు. గుండెను విమానం ద్వారా తిరుపతి పద్మావతి ఆస్పత్రికి, ఒక కిడ్నీ ఆయుష్ ఆస్పత్రికి, మరో కిడ్నీ, లివర్‌ను మణిపాల్ ఆస్పత్రికి పంపించారు.

లండన్‌లో పలస్తీనా సంఘీభావ ర్యాలీ

పాల్గొన్న వేలాది మంది

లండన్: గాజా స్ట్రిప్‌లో వైమానిక, భూతల దాడులను ఇజ్రాయిల్ మరింత విస్తరించిన వేళ కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తూ బ్రిటన్ రాజధాని లండన్‌లో భారీఎత్తున పలస్తీనా సంఘీభావ ర్యాలీ జరిగింది. వేలాది మంది పలస్తీనాకు మద్దతుగా కదం తొక్కారు. పలస్తీనాకు సంఘీభావం ప్రకటించారు. దాడులను ఆపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని బ్రిటన్ ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. పలస్తీనా సంఘీభావ మార్చ్ పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా సాగింది. పార్లమెంటు, ప్రధాని రిషి సునాక్ అధికారిక నివాసం మీదగా ర్యాలీ సాగింది. 'అగ్రదేశాలు ప్రస్తుతం తగు విధంగా చర్యలు తీసుకోవడంలేదు. అందుకోసమే మేమంతా వీధుల్లోకి వచ్చాం. కాల్పుల విరమణకు పిలుపునిస్తున్నాం. పలస్తీనా హక్కుల పరిరక్షణకు డిమాండ్ చేస్తున్నాం' అని ప్రదర్శనకారులు నినదించారు.

కరువు మండలాలు ప్రకటించి ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించి ఖరీఫ్‌లో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, రబీ పంట కాలానికి అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలి. నష్టపోయిన పంటలను ఎన్యుమరేషన్ చేసి ఆహార పంటలకు రూ.25 వేల వంతున, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, వాతావరణ పంటల భీమా అమలు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి వలసల నివారణకు చర్యలు చేపట్టాలని, ఖరీఫ్ కాలంలో రైతులు, కౌలు రైతులు తీసుకున్న అన్ని రకాల అప్పులను రద్దుచేసి, రబీ పంట కాలానికి తిరిగి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, రబీలో పంటలు వేసే రైతాంగానికి 90శాతం సబ్సిడీతో విత్తనాలు, పశుగ్రాసం, దాణా ఉచితంగా అందించాలని, కరువు పెన్షన్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం డిమాండ్ చేసింది.

వృద్ధులకు రూ.6వేలు, వికలాంగులకు రూ.7వేలు ఇవ్వాలి

వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళల పెన్షన్‌లను నెలకు రూ.6వేలు, విభిన్న ప్రతిభావంతులు లేక వికలాంగులకు పెన్షన్ నెలకు 7వేలకు పెంచాలని కోరుతూ సమావేశం మరో తీర్మానం చేసింది. వయోవృద్ధులు తమ యావత్తు జీవితకాలాన్ని కుటుంబంకోసం, సంపద సృష్టికోసం, సమాజాభివృద్ధికోసం అంతిమంగా దేశ ప్రయోజనాలకోసం తమ శక్తి సామర్థ్యాలను ధారపోసి అలసిపోయి ఉంటారు. అనేక జీవన రంగాలలో అలుపెరుగకుండా శ్రమించిన ఈ కార్మిక, కర్షక, నిరుపేద వర్గాల వారికి వృద్ధాప్యంలో గౌరవప్రదంగా జీవించడానికి తగినంతగా పెన్షన్ అందించాల్సిన బాధ్యత మన ప్రభుత్వాలపై ఉంది. వ్యవసాయ పంటలు పండించటం నుంచి ముఠా కూలీలుదాకా, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చేనేత, మత్స్య, గీతలాంటి పలు చేతివృత్తుల నుండి ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు, షాపు గుమస్తాలదాకా జీవితకాలం రెక్కలు ముక్కలుచేసుకుని జీవనం పొందుతున్నారు. ఈ సంపద సృష్టికర్తలందరికీ (వృత్తిదారులందరికీ) రిటైర్‌మెంట్ కాలమంటూ లేకపోయింది. ఆయా ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై పెన్షన్ వయస్సు నిర్ణయిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కాకపోయినా కనీస ఆర్థిక తోడ్పాటు, ఆరోగ్య బీమా, ఉచిత మందుల సదుపాయం కలిపించాల్సిన సామాజిక బాధ్యత చట్టబద్ధంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నది. ఎయిడ్స్, కిడ్నీలు, తలసేమియా, పక్షవాతం, మంచంమీద నుంచి లేవలేని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, స్వలింగులు మొదలైన వారందరికీ వయసుతో సంబంధం లేకుండా పెన్షన్లు ఇవ్వాలి. ఒంటరి మహిళలకు రద్దుచేసిన పెన్షన్లను పునరుద్ధరించి, 30 సంవత్సరాలకే అందించాలి. మన జనాభాలో 12% మంది 60 సంవత్సరాలు దాటిన 60 లక్షలకు పైబడిన వయోవృద్ధులున్నారు. గత నాలుగేళ్లలో నిత్య జీవితావసర వస్తువులు, వైద్యం, మందులు తదితరాల ధరలు అపరిమితంగా పెరిగిపోయాయి. పెరుగుతున్న జీవన వ్యయానికి తగు విధంగా అన్ని రకాల పెన్షన్లను పెంచాలి. పెన్షన్ కొరకు చేసుకున్న అర్జీని అదే నెలలో విచారించి, మంజూరు చేయాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్దతును కోరుకుంటున్న పై వర్గాలన్నింటినీ ఆదుకునేందుకు పై డిమాండ్లను పరిశీలించి సత్వర అమలుకు చర్యలు చేపట్టవలసిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ సమావేశం తీర్మానించింది.

భార్యాభర్తలిద్దరికీ పెన్షన్ ఇవ్వాలి

భార్యాభర్తలు ఇద్దరూ బ్రతికి ఉంటే ఉభయులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని సీపీఐ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. అలాగే 2007 తల్లితండ్రుల పోషణ, వృద్ధుల సంరక్షణ చట్టాన్ని సక్రమంగా అమలుచేసి రక్షణ కల్పించాలని, స్వార్జిత ఆస్తులు కలిగి ఉన్న సీనియర్ సిటిజన్స్ తమ బిడ్డల నిరాధారణకు గురైన సందర్భాలలో బ్యాంకులు రివర్స్ మార్ట్ గేజ్ స్కీము అమలు చేయాలని, వృద్ధుల సంక్షేమం కొరకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేదా కమిషనరేట్‌ను ఏర్పాటుచేయాలని, పెన్షన్‌దారులకు ఇచ్చే అన్నిరకాల సర్టిఫికెట్లను వారం రోజుల్లో ఇచ్చేలా ప్రభుత్వం జీవో ఇస్తూ, ఈ తరహా పెన్షన్లన్నింటికీ చట్టభద్రత కల్పించాలని సమావేశం కోరింది. ఇక ఉచిత వైద్య సదుపాయాలు, మందులు, ఆరోగ్య పరీక్షలు చేయించుకొటకు ప్రతి పెన్షన్‌దారునికి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలతో కూడిన వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక ఆరోగ్య భీమా సదుపాయం కల్పించాలని, రైళ్లల్లోనూ, ఆర్‌టిసి బస్సుల్లోను ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

తలొగ్గిన భారత్

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. అమెరికా సామ్రాజ్యావాదానికి భారత్ దాసోహమైందని శనివారం సంయుక్త ప్రకటనలో రాజా, ఏచూరీ వ్యాఖ్యానించారు. భారత్ విదేశాంగ విధానం సామ్రాజ్యవాదానికి అనుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికా-ఇజ్రాయిల్-భారత్ సంధికి పెద్దపీట వేసి పలస్తీనాకు అన్యాయం చేసేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. 22 లక్షల మంది పలస్తీనా ప్రజలకు ఇజ్రాయిల్ నిలువ నీడలేకుండా చేసిందని, గాజాతో అన్ని రకాల సంబంధాలను తెంచివేసిందని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కాల్పులు, దాడులను ఆపేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. వెంటనే కాల్పులు విరమించేలా ఐరాస తీర్మానించడాన్ని గౌరవిస్తున్నామని తెలిపారు. తూర్పు జెరూసలేం రాజధానిగా పలస్తీనా దేశాన్ని 1967 నాటి సరిహద్దుల ఆధారంగా ఏర్పాటు చేసే దిశగా రెండు దేశాల పరిష్కారం అమలు కోసం సత్వరమే చర్యలను ఐరాస చేపట్టాలని రాజా, ఏచూరీ కోరారు. కాగా, శుక్రవారం మొదలైన సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాలు ఆదివారంతో ముగియనున్న సందర్భంగా పలస్తీనాకు మద్దతుగా అదే రోజు ఏకేజీ భవన్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించాలని సీపీఎం నిర్ణయించింది. దీనిని జయప్రదం చేయాలని ఏచూరి పిలుపునిచ్చారు.

భారత్ తీరు సిగ్గుచేటు: ప్రియాంక గాంధీ

ఐరాసలో ఇజ్రాయిల్-హమాస్ పోరుపై ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయకుండా భారత్ ఓటింగ్‌కు దూరంగా ఉండటం సిగ్గుచేటని, ఈ పరిణామం తమను షాక్‌కు గురిచేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ఇన్నేళ్లుగా పలస్తీనాకు అండగా నిలుస్తూ భారత్ చేసినదంతా బూడిదలో పోసిన పన్నీరైందని విమర్శించారు. కన్నుకు బదులు కన్ను అన్న ధోరణితో మొత్తం ప్రపంచం గుడ్డిదైపోతుందని ఎక్స్ మాధ్యమంగా ఆందోళన వ్యక్తం చేశారు. 'గాజాలో కాల్పుల విరమణపై ఓటింగ్ నుంచి భారత్ తప్పుకోవడం షాక్‌కు గురిచేసింది. మన దేశం తీరు మమ్మల్ని తలదించుకునేలా చేసింది. అహింసా, సత్యమార్గాన భారత్ స్వాతంత్ర్య పోరాటం సాగింది. ఇదే మూల సిద్ధాంతాలుగా దేశం ఆవిర్భవించింది. ఇదే సిద్ధాంతాల కోసం అనేక మంది తమ ప్రాణాలను త్యాగంచేశారు. భారత నైతిక ధైర్యానికి... అంతర్జాతీయ సామాజిక భాగస్వామ్యానికి ఇవే ఆధారం. ఇలాంటి సిద్ధాంతాలను కాదని మౌనంగా మానవాళిపై జరిగే ఘోరాలకు వంత పడటం ఆక్షేపణీయం. ఆహారం, మంచినీరు, మందులు, వైద్యం, విద్యుత్ లేకుండా లక్షల మంది పురుషులు, మహిళలు, చిన్నారుల జీవితాలను పణంగా పెట్టడం మన సిద్ధాంతాలకు విరుద్ధం. పలస్తీనాకు న్యాయం కోసం మన దేశం కట్టుబడి ఉంది' అని ప్రియాంక ట్వీట్ చేశారు.

ఉగ్రవాదానికి మద్దతివ్వం: నక్వీ

భారత్ ఎప్పుడు కూడా ఉగ్రవాదానికి మద్దతివ్వదని ఐరాసలో దేశం తీరును తప్పుపడుతున్న వారు గ్రహించాలని ప్రియాంక గాంధీ వ్యాఖ్యలనుద్దేశించి బీజేపీ సీనియర్ నేత ముక్తార్ అబ్బాస్ నక్వీ అన్నారు. ఐరాస తీర్మానంపై ఓటింగ్‌కు దూరంగా ఉండటానికి భారత్ వివరణను వర్గీకరించి విమర్శిస్తున్నారని ఎక్స్ మాధ్యమంగా తెలిపారు. ఇజ్రాయిల్-పలస్తీనా వ్యవహారంలో తమ వైఖరి ఒకేలా ఉందని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదం పక్షాన్న నిలిచేవారికి మద్దతిచ్చేది లేదని స్పష్టంచేశారు. 'మీ ఎక్స్ ఖాతా నుంచి వచ్చే పోస్టుల గురించి మీకు అవగాహన అవసరం. కాంగ్రెస్ గత వైఖరి గురించి తెలియని వారు మీకు సలహాలు ఇస్తున్నట్లు తోస్తోంది. రాహుల్ కంటే మీరు నయమని చూపే ప్రయత్నంలో మిమ్మల్ని తెలివితక్కువ వ్యక్తిగా చూపుతున్నారని గ్రహించడం మంచిది' అని ప్రియాంకనుద్దేశించి నక్వీ ట్వీట్ చేశారు.

పరాజయం

(మొదటిపేజీ తరువాయి)

సాయం తక్షణమే అందించాలని కోరింది. ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా 120 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. దీంతో ఇజ్రాయిల్-అమెరికా యుద్ధ కూటమికి పరాభవం తప్పలేదు. చిన్నాచితక 14 దేశాలు మాత్రమే తీర్మానాన్ని వ్యతిరేకించాయి. హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా చాలా కొద్ది దేశాలు గుర్తించాయి. ఐరాస దానిని ఉగ్రవాద సంస్థగా ముద్రవేయలేదన్నది గమనార్హం. తాజా తీర్మానంలో ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి ప్రస్తావన లేదంటూ ఓటింగ్ నుంచి భారత్ తప్పించుకుంది. ఓటింగ్‌కు దూరంగా ఉండటం ద్వారా తనది ఎవరి పక్షమో చెప్పకనే చెప్పింది. దీంతో భారత్ తీరుపై విమర్శలు కూడా వచ్చాయి. అయితే కావాల్సిన ఓట్లు రావడంతో పౌరుల రక్షణ, చట్టపరమైన, మానవతా బాధ్యతలను సమర్థించడం కోసం ప్రవేశపెట్టిన తీర్మానానికి ఐక్యరాజ్య సమితిలో ఆమోదం లభించింది. భారత్, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, జపాన్, ఉక్రెయిన్, బ్రిటన్ సహా 45 దేశాలు ఈ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి.

జోర్డాన్ ప్రతిపాదిత తీర్మానంలో హమాస్ గురించి ప్రస్తావన లేకపోవడాన్ని అమెరికా తీవ్రంగా పరిగణించింది. ఇజ్రాయిల్‌పై దాడులను పట్టించుకోలేదని విమర్శించింది. ఓటింగ్‌కు ముందు అమెరికా మద్దతుతో కెనడా ఒక సవరణను ప్రతిపాదించింది. అంతర్జాతీయ చట్టాలకనుగుణంగా బేషరతుగా బందీల విడుదలను సూచించింది. ఈ సవరణకు భారత్ సహా 87 దేశాలు మద్దతివ్వగా 55 దేశాలు వ్యతిరేకించాయి. మరో 23 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. మెజారిటీ రాకపోవడంతో సవరణ తీర్మానం వీగిపోయింది. ఈమేరకు ఐక్యరాజ్యసమితి 78వ జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు డాన్నిస్ ఫ్రాన్సిస్ వెల్లడించారు. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఓట్లు రావడంతో ఆ దేశం ఆగ్రహం వ్యక్తంచేసింది. నాజీ ఉగ్రవాదులకు అంతర్జాతీయ సమాజం కొమ్ముకాసిందని వ్యాఖ్యానించింది. ఐరాస సభ్యదేశాలు 193 కాగా వీటిలో అమెరికా-ఇజ్రాయిల్ పక్షాన్న నిలిచినది ఏడు శాతమే. ఈ 14 దేశాల్లో అమెరికా, ఇజ్రాయిల్ మినహాయిస్తే చెప్పుకోదగ్గ దేశాలు లేవు. దీంతో 75ఏళ్ల ప్రపంచ పోలీసు అమెరికాకి ఓటమి ఎదురైనది. జీ7 కూటమి సభ్యదేశాల్ని తన వెంట నిలబెట్టుకోలేకపోవడం కూడా అమెరికాకు పరాభవమే. ఐదు శాశ్వత సభ్యదేశాల్లో... జీ-7 దేశాల్లో నుంచి అమెరికా తప్ప ఏ దేశం యుద్ధ అనుకూల వైఖరిని ప్రదర్శించలేదు. పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల కూటమికి అమెరికా నాయకత్వం వహిస్తున్నది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఇది మరింత బలపడింది. కానీ అమెరికా ఈసారి ఒంటరైంది. ఆకస్ కూటమి, క్వాడ్ కూటమి నుంచి అమెరికా ఏకాకి కావడం గమనార్హం. అరబ్ లీగ్‌లోని 21 దేశాలతో కలిపి ఇస్లామిక్ దేశాల సహకార సంస్థలో 56 దేశాలు ఉన్నాయి. వీటిలో ఇరాక్ మాత్రమే 'అబ్‌స్టెయిన్' దేశాల్లో ఉంది. మిగిలిన దేశాలు గాజాకు మద్దతిస్తూ ఐరాస తీర్మానానికి అనుకూలంగా ఓటింగ్ చేశాయి. ఇదిలావుంటే దక్షిణాసియాలో భారత్ ఒక్కటే ఇజ్రాయిల్‌కు పరోక్ష మద్దతు తెలిపింది. దురాక్రమణను వ్యతిరేకించలేదు. మరోవైపు పాకిస్తాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, నేపాల్, భూటాన్, శ్రీలంక తీర్మానానికి అనుకూలంగా ఓటేసి గాజా పక్షాన నిలిచి ఇజ్రాయిల్ దాడులను ఖండించాయి. ఏదిఏమైనా అంతర్జాతీయ సమాజం స్థూలంగా విజ్ఞత ప్రదర్శించింది.

మానవతా సాయానికి ఈయూ బ్రస్సెల్స్ సదస్సు తీర్మానం

గాజాకు తక్షణమే సాయం అందించేందుకు మానవతా కారిడార్లను ఏర్పాటు చేయడం అత్యవసరమని, బాంబు దాడులను ఆపి వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలంటూ యూరోపియన్ యూనియన్ (ఈయూ) సదస్సు తీర్మానించింది. 27 సభ్యదేశాల ఈయూ...బ్రసెల్స్‌లో నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగిసింది. ఇజ్రాయిల్-హమాస్, ఉక్రెయిన్, రష్యా మధ్య పోరుపై సదస్సు వాడీవేడిగా చర్చించింది. ఈ సందర్భంగా గాజాలో భీకర పోరు ఆ ప్రాంతానికే కాదు మొత్తం ప్రపంచానికి చాలా ప్రమాకరంగా పరిణమించవచ్చని ఈయూ అధ్యక్షుడు చార్లెస్ మైఖెల్ అన్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు ఈయూ ప్రయత్నిస్తోందన్నారు. అంతర్జాతీయ మానవతా చట్టాలకు కట్టుబడటం, అన్ని వేళలా పౌరుల రక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం అవసరమని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో త్వరలోనే అంతర్జాతీయ శాంతి సదస్సు జరిపించాలనే ప్రతిపాదనకు ఈయూ మద్దతిచ్చింది.

గాజాలో బ్లాకౌట్-తెగిపోయిన సంబంధాలు

హమాస్ నియంత్రణలోని గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులతో ఆ ప్రాంతంలో మొత్తంగా బ్లాకౌట్ నెలకొంది. అన్ని రకాల సంబంధాలు తెగిపోయాయి. శుక్రవారం సాయంత్రం ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ భీకర దాడులతో ఇంటర్నెట్, కమ్యూనికేషన్ వ్యవస్థలన్నీ ధ్వంసమైనట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. గాజా స్ట్రిప్‌లో బాంబు దాడుల కారణంగా మొబైల్ ఫోన్ సేవలు, అంతర్జాల సేవలన్నీ దెబ్బతిన్నట్లు పలస్తీనా టెలికం సంస్థ తెలిపిది. ఏ నెట్వర్క్ కూడా పనిచేయడం లేదని, తమ వారిని చేరుకోలేకపోతున్నట్లు అల్ జజీరా వార్తా సంస్థ కూడా ప్రకటించింది.

'అక్కడ ఏం జరుగుతోందో తెలియదు. ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అంతుపట్టడంలేదు. ఎంత మంది బాధితులు ఉన్నారో సమాచారం లేదు' అని ఖాన్ యూనిస్ విధుల్లో ఉన్న జర్నలిస్ట్ ఒకరు తెలిపారు. కాగా 22 రోజులుగా గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటికే 7,300 మంది పలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోగా ఇందులో మూడువేల మందికిపైగా చిన్నారులు ఉన్నారని గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది.

ఉన్నత విద్యకు విదేశీ బాట

(మొదటిపేజీ తరువాయి)

ఐర్లాండ్, సింగపూర్, రష్యా, ఫ్రాన్స్ చేరాయి. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో పంజాబ్, తెలంగాణ, మహారాష్ట్ర టప్‌లో ఉన్నాయి. ఈ మేరకు 'బియాండ్ బెడ్స్&బౌండరీస్: ఇండియన్ స్టూడెంట్ మొబిలిటీ రిపోర్ట్-2023' చెబుతోంది. దీనిని శుక్రవారం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎంక్లేవ్‌లో విడుదల చేశారు. 2019లో 10.9లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళ్లగా 2022 నాటికి ఈ సంఖ్య 13.24 లక్షలకు పెరిగింది. అంటే ఏడుశాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత వృద్ధిరేటు 15శాతంగా ఉంది. దీంతో 2025 నాటికి విదేశాల్లో చదువుకునే భారతీయుల సంఖ్య 20 లక్షలను దాటిపోనుంది. సాధారణంగా అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు భారతీయ విద్యార్థులు ఇష్టపడతారు కానీ జర్మనీ, కిర్గిస్తాన్, ఐర్లాండ్, సింగపూర్, రష్యా, ఫిలిప్పీన్స్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ వెళ్లేందుకు అనేకమంది ఆసక్తి చూపుతున్నట్లు నివేదిక చెబుతోంది. ఇదే క్రమంలో విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు సంబంధించి పంజాబ్, ఆంధ్రప్రదేశ్/తెలంగాణ, మహారాష్ట్ర (12.5శాతం చొప్పున), గుజరాత్ (ఎనిమిది శాతం), ఢిల్లీ/ఎన్‌సీఆర్ (ఎనిమిది శాతం), కర్నాటక (ఆరు శాతం) నుంచి వెళ్లగా ఇతర రాష్ట్రాల వారు 33శాతం మేర ఉన్నట్లు నివేదిక తెలిపింది.

విదేశీ విద్య కోసం చేసే వ్యయం 2025 నాటికి 70 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని కూడా అంచనా వేసింది. 2019లో విదేశీ విద్య కోసం వెచ్చించినది 37 బిలియన్ డాలర్లు కాగా 2022 నాటికి తొమ్మిది శాతం పెరిగి 47 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రస్తుతం 14శాతం వృద్ధిరేటు ప్రకారం 2025 నాటికి ఏకంగా 70 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని నివేదిక వెల్లడించింది. ఈ నివేదికను యూనివర్సిటీ లివింగ్ అకామడేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల వసతి నిర్వహణను చూసే సంస్థ), వన్ స్టెప్ గ్లోబల్ (ఆసియాలో పాదం మోపేందుకు ప్రభుత్వ సంస్థలు, విద్యా వ్యవస్థలకు మార్కెట్‌లో ప్రవేశాన్ని కల్పించే సంస్థ) రూపొందించాయి. విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థులు సరైన వసతి కోసం పడే కష్టాలు, నిత్య జీవితంలో ఎదుర్కొనే ఇబ్బందుల గురించీ ఈ నివేదిక వెల్లడించింది.

చివరి కౌన్సెలింగ్ ఉంటుందా?

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరం ఆలస్యంగా ప్రారంభం కావడంతో వారికి దిక్కుతోచని స్థితి నెలకొంది. ఈ సమస్యను ప్రభుత్వానికి, ఉన్నత విద్యా మండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కౌన్సెలింగ్ తీరులో మార్పు లేదు. ఏపీలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ జాప్యం కారణంగా తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఒడిశా తదితర పొరుగు రాష్ట్రాలకు విద్యార్థులు వలసలు పోతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, కౌన్సెలింగ్‌లో లోపాలు వెరసి తమ పిల్లలపై ప్రభావం చూపుతున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. వాస్తవంగా మే నెలలో ఏపీ ఈఏపీసెట్ పరీక్షను నిర్వహించి, జూన్‌లో కౌన్సెలింగ్ ఏర్పాటు చేసేవారు. జులై, ఆగస్టు మొదటి వారానికి తరగతులు ప్రారంభమయ్యే పరిస్థితి ఉండేది. పరీక్షతో పాటు కౌన్సెలింగ్ నిర్వహణ ఆలస్యంతో వేలాది మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఎదురవుతోంది. అక్టోబరు ముగుస్తున్నప్పటికీ కౌన్సెలింగ్ నిర్వహణ, ప్రవేశాలు ప్రక్రియను పూర్తి చేయడంలో ఉన్నత విద్యా మండలి విఫలమైందనే విమర్శలున్నాయి. ఇక విద్యా సంవత్సరం క్యాలెండర్ హడావుడీగా ప్రారంభించడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. ఇది పూర్తిగా ఉన్నత విద్యాశాఖ అధికారుల వైఫల్యమనే విమర్శలు ఉన్నాయి.

అసంపూర్తిగా సీట్ల భర్తీ ప్రక్రియ

మొదటి, రెండో విడత వెబ్ కౌన్సిలింగ్ అసంపూర్తిగా ముగిసినట్లు తెలిసింది. కేవలం 69 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఉమ్మడి 13 జిల్లాలలో ప్రతి జిల్లాకు 2,500 పైన సీట్లు మిగిలిపోయాయి. మొత్తంగా 27,590 పైగా సీట్లు భర్తీ కాకుండా ఉన్నాయని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ ఇటీవల వెల్లడించింది. మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహణతో వందలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. లేకుంటే ఆ సీట్లన్నీ మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇక అవన్నీ ప్రైవేట్ కళాశాల యాజమాన్య పరిధిలోకి వెళ్లిపోతాయి. దీంతో విచ్చలవిడిగా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ సీట్లను విక్రయించుకుంటారు. వెబ్ కౌన్సెలింగ్ కాకుండా నేరుగా యాజమాన్య కోటాలో సీట్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర సౌకర్యాలు ఉండబోవు. దీంతో వారంతా ఆర్థికంగా చితికిపోతారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి తక్షణమే ఏపీ ఈఏపీ సెట్ మూడో విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆంధ్ర వైద్య కళాశాల పైలాన్ ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఆంధ్రా వైద్య కళాశాల శత వసంతాల వేడుకలను పురస్కరించుకుని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆంధ్రా వైద్య కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పైలాన్ ఆవిష్కరించారు. జిల్లాలో శనివారం నిర్వహించిన ఆంధ్రా వైద్య కళాశాల శత వసంతాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. వైద్యుల విరాళంగా అందించిన రూ.20 కోట్లతో నిర్మించ నున్న క్లినికల్ అండ్ బయోమెడికల్ రీసెర్చ్ సెంటర్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆంధ్రా వైద్య కళాశాల ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటివరకు గల ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజని, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ అధ్యక్షులు జె.సుభద్ర, రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్.నరసింహారావు, సియం రమేష్, పార్లమెంటు సభ్యులు బి.వి.సత్యవతి, ఎం.వి.వి.సత్య నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ అధ్యక్షులు డా. టి.రవి రాజు, ఏఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. పి.అశోక్ కుమార్, అనేక మంది జిల్లా వైద్య అధికారులు పాల్గొన్నారు.

చంద్ర గ్రహణం... శ్రీవారి ఆలయం మూసివేత

విశాలాంధ్ర-తిరుమల: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానం ముందస్తుగా ప్రకటించిన మేరకు శనివారం రాత్రి 7.05 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులను మూసివేశారు. ఆలయ తలుపులను తిరిగి ఆదివారం తెల్లవారు జామున 3.15 గంటలకు తెరుస్తారు. ఆలయ శుద్ధి అనంతరం ఉదయం 6 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. దాదాపు ఎనిమిది గంటల పాటు ఆలయ తలుపులు మూసి ఉంటాయి. అక్టోబరు 29వ తేదీ తెల్లవారుజామున 1.05 గంటల నుంచి 2.22 గంటల మధ్య పాక్షిక చంద్రగ్రహణం పూర్తవుతుంది. ఈ కారణంగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని శనివారం సాయంత్రం 6 గంటలకు మూసివేశారు. దీనిని ఆదివారం ఉదయం 9 గంటలకు తెరుస్తారు. ఈ సమయంలో అన్నప్రసాదాల పంపిణీ ఉండదు. అదేవిధంగా శనివారం సహస్ర దీపాలంకార సేవను, వికలాంగులు, వయోవృద్ధుల దర్శనాన్ని టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎ.వి.ధర్మారెడ్డి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ శ్రీహరి, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగన్‌కు కళ్లు తెరిపిద్దాం'

- రాత్రి 7 గంటలకు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన
- చంద్రబాబుపై జగన్ వ్యక్తిగత కక్ష సాధిస్తున్నారు
- అందుకే ఆధారాల్లేకుండానే 50 రోజులుగా జైలులో ఉంచారు: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్న టీడీపీ ఆదివారం మరో వినూత్న నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. మోత మోగిద్దాం, కాంతితో క్రాంతి, న్యాయానికి సంకెళ్ళు, జగనాసుర దహనం వంటి కార్యక్రమాలు చేపట్టిన టీడీపీ తాజాగా రాష్ట్రంలో అరాచక, చీకటి పాలన సాగిస్తున్న 'జగనాసురుడికి కళ్ళు తెరిపిద్దాం' పేరిట మరో నిరసన కార్యక్రమానికి పిలుపిచ్చింది. ఆదివారం రాత్రి 7 నుంచి 7.05 గంటల మధ్యలో కళ్లకు గంతలు కట్టుకుని ఇళ్ల వద్దే బాల్కనీ, వీధులు, వాకిళ్లలోకి వచ్చి చంద్రబాబుకి మద్దతుగా నిజం గెలవాలి అని గట్టిగా నినదించాలని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ ఫొటోలు, వీడియోలు వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేయాలని కోరారు. చంద్రబాబునాయుడును జైలులో బంధించి 50రోజులైంది. ఏ తప్పు చేయకపోయినా వ్యవస్థలను మేనేజ్ చేసి ఆయనను ప్రజలమధ్యకు రాకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబు నాయుడుతో ములాఖత్ అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడారు. గతంలో రాజకీయ కక్షసాధింపు చూశాం, ఇప్పుడు వ్యక్తిగత కక్షసాధింపులు చూస్తున్నాం అన్నారు. వ్యక్తిగతకక్షతో జగన్ తోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చంద్రబాబును చంపేస్తామని చెప్పడం రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు. అనంతపురంలో వైసీపీ ఎంపీ ఒకరు జైలులోనే చంద్రబాబు చనిపోతారని చెబుతున్నారు. కేసుకు ఎలాంటి సంబంధం లేని మా తల్లిని జైలుకు పంపుతామని మహిళా మంత్రి ప్రకటన చేశారు. వారి ప్రకటనలు చూశాక చంద్రబాబు భద్రతపై మాకు సందేహాలు మరింత పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారీ స్కాం అంటూ అరెస్ట్ చేసి, గత 50రోజులుగా ఒక్క ఆధారమైనా ప్రభుత్వం బయటపెట్టిందా? అని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో గరిష్ఠంగా ఒక వ్యక్తి 38రోజులు రిమాండ్‌లో ఉన్నారు, ఏ ఆధారం లేకుండా చంద్రబాబునాయుడును 50రోజులుగా రిమాండ్ లో ఉంచడం వ్యవస్థలు మేనేజ్ కాదా ? మేనేజ్ చేయకపోతే లక్షకోట్ల అవినీతి చేసిన జగన్ పదేళ్లుగా బెయిల్‌పై ఎలా బయట ఉన్నారు, బాబాయి హత్యకేసులో అవినాష్ ఎలా బయట తిరుగుతారు. . మైనింగ్ దోచేసిన పాపాల పెద్దిరెడ్డి బయట ధైర్యంగా ఎలా తిరుగుతారో వారే చెప్పాలన్నారు.

కంటిడాక్టర్ రిపోర్టు ఎలా మారిపోయింది?

బాబుగారికి నెలలోగా ఆపరేషన్ చేయాలని ఒక రిపోర్టులో ఉంది, అదే కంటి వైద్యుడు తొందరేం లేదని మరో రిపోర్టులో ఉంది. 24గంటల్లో ఆ వైద్యుడు ఎలా మనసు మార్చుకున్నారు? వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారన దానికి ఇంకా ఎన్ని ఆధారాలు కావాలి? ఈ ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయాం, పరీక్షలపేరుతో ఏం చేస్తుందోనన్న భయం మాలో ఉంది. దక్షిణ భారతదేశంలో ఎన్ఎస్ జి రక్షణలో ఉన్న ఒకే ఒక వ్యక్తి చంద్రబాబునాయుడు, ప్రతిపక్షంలో ఉన్నా ఆయనకు కేంద్రం ఆయనకు రక్షణ కల్పించింది. చంద్రబాబు 6 కిలోలు బరువుతగ్గిన మాట వాస్తవం, 72 ఉండేవారు, 66కిలోలకు తగ్గారు, ఆయన రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటారు, ఆయనకు గుండె సంబంధిత సమస్య ఉన్న మాట వాస్తవం. మేం ములాఖత్‌కు వెళ్లాక అధికారికి పదిసార్లు ఫోన్లు వచ్చాయి. ఈ ప్రభుత్వ పర్యవేక్షణలో మేం వైద్య పరీక్షలకు సిద్ధంగా లేము, మాకు నమ్మకం లేదు. సొంత బాబాయిని చంపినోడు, చెల్లిన మెడబట్టి బయటకు గెంటేసినవాడు ఈ ముఖ్యమంత్రి, ఆయనను మేం నమ్మలేమన్నారు. ఒక పక్క దళితులను ఊచ కోత కోస్తూ మరోవైపు ఏ ముఖం పెట్టుకుని వైసీపీ నాయకులు సామాజిక బస్సు యాత్ర చేస్తారని ప్రశ్నించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే జగన్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని లోకేశ్ హెచ్చరించారు.

ఆర్టీసీ డ్రైవర్లపై దాడిచేసిన దుండగులను అరెస్టు చేయాలి

- నేడు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు
- ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కావలిలో ఆటోనగర్ డిపో డ్రైవర్లపై దాడిని ఖండిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 129 డిపోలలో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగుళూరు నుంచి విజయవాడ వస్తున్న ఏపీ 16 జెడ్ 0702 నంబరు గల సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ బీఆర్ సింగ్‌తో పాటు మరో డ్రైవర్‌పై వ్యక్తులు భౌతికంగా దాడి చేయడం అమానుషమని, దీనిని యూనియన్ తరపున తీవ్రంగా ఖండిస్తూ, ఈనెల 29న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, ధర్నాలు చేపడతామన్నారు. ఇదే అంశంపై సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు ఆర్టీసీ ఈయూ నాయకుల అధ్వర్యంలో స్పందనలో ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఆ జిల్లా ఎస్పీని కలవనున్నట్లు పేర్కొన్నారు. దుండగులను అరెస్టు చేయడంలో జాప్యం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. విచక్షణారహితంగా, భౌతికంగా దాడి చేసిన సదరు వ్యక్తులపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డీజీపీకి, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. నిరంతరం ప్రజల మధ్య విధుల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై భౌతికంగా దాడి చేసిన వారికి తీవ్రమైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయవాడలో డ్రైవర్‌ను పరామర్శించిన ఈయూ నేతలు

కావలిలో దాడికి గురైన డ్రైవర్ సింగ్‌ను విజయవాడ ఆర్టీసీ ఆస్పత్రిలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పలిశెట్టి దామోదరరావు, ఎం.శంకరరావు, వై.శ్రీనివాసరావు, సీఎంఓ డాక్టర్ అప్పారావు తదితరులు పరామర్శించారు. డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

దెబ్బలు తట్టుకోలేకపోయా... చనిపోతాననుకున్నా...

కావలిలో దాడికి గురైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ సింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'కాళ్లతో తన్నారు... పిడిగుద్దులతో దాడికి దిగారు. దెబ్బలు తట్టుకోలేక నడిరోడ్డు పైన కింద పడిపోయాను.. ఆ సమ యంలో బతుకుతానని నాకు అనిపించలేదు...' అని ఏపీఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ బీఆర్ సింగ్ వాపోయారు. కావలిలో దుండగుల దాడిలో ఆర్టీసీ డ్రైవర్ గాయపడిన విషయం తెలిసిందే. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం విజయవాడలోని ఆర్టీసీ ఆస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం శనివారం ఆయన చేరారు. ఈ సందర్భంగా మీడియాతో డ్రైవర్ సింగ్ మాట్లాడుతూ అడ్డు తప్పుకోవాలని బస్సు హారన్ మోగించడంతో తనపై 14 మంది దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వాహనాల్లో కావలి శివారు ప్రాంతం వరకు 14 మంది బస్సును వెంబడించి తనపై ఏకకాలంలో దాడికి దిగారన్నారు. వారి దెబ్బలను తట్టుకోలేక రోడ్డు పైన కింద పడిపో యానని, పొట్టతో పాటు చాలా ప్రాంతాల్లో బలంగా దాడి చేశారని వివరించారు. ఆ సమయంలో తాను బతుకుతానని అనుకోలేదని, దేవుడి దయ వల్లే ప్రాణాలతో బయటపడ్డానని చెప్పారు. దాడికి పాల్పడిన 14 మంది ఫొటోలు తన వద్ద ఉన్నాయని, దాడి సంఘటన మొత్తం ఫోన్‌లో రికార్డ్ అయిందని, ఈ సంఘటనకు సంబంధించి తగిన ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. నిందితులను శిక్షించేంతవరకు తాను వదలబోనని అన్నారు. ఈ తరహా దాడిని నా సర్వీసులో ఇంతవరకు చూడలేదని చెప్పారు. వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే తాను న్యాయపోరాటం చేస్తానని డ్రైవర్ బీఆర్ సింగ్ స్పష్టం చేశారు.

జలవనరుల వినియోగంలో ప్రభుత్వం విఫలం

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య



విశాలాంధ్ర-గన్నవరం: పోలవరం కాల్వ పక్కన ఉన్న జలవనరులను వాడుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య విమర్శించారు. శనివారం గన్నవరం మండలంలోని బీబీ గూడెం, గొల్లనపల్లి, గోపవరపు గూడెం, చిక్కవరం గ్రామాలలో నీటి ఎద్దడి కారణంగా ఎండిపోయిన పొలాలను కౌలు రైతు సంఘం, రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో వర్షాలు తక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ తెలిపినా, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. గత ప్రభుత్వంలో గొల్లనపల్లి గ్రామానికి లిఫ్టు ద్వారా పోలవరం కాలువ నీరుతో చెరువులు నింపారని చెప్పారు. మూడు సంవత్సరాలుగా లిఫ్ట్ ఉపయోగించకపోవటం వల్ల రైతు ఇబ్బందులకు గురైవుతున్నారని అన్నారు. దిగువ ఉన్న పోలవరం కాలువ నీటిని అందించకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నారు. ఎన్ఎస్పీ కాలువ ద్వారా అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల పంటలు ఎండిపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని తెలిపారు. బ్రహ్మయ్యలింగం చెరువు సప్లయి చానల్ పూడిపోవడం, ఉమ్మడి కృష్ణాజిల్లా వరప్రదాయిని చింతపూడి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేయటం వల్ల పంట పొలాలకు నీరందని పరిస్థితి అని విమర్శించారు. ప్రభుత్వం నష్టపోయిన వరి పంటకు రూ.35 వేలు, పత్తికి రూ.40 వేలు, మినుముకు రూ.25 వేలు, మిర్చికి లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ముక్కమాల ఉమామహేశ్వరవు, శనగల సుబ్బారెడ్డి, గొంది శోభనాచలపతిరావు, బోయపాటి శివరామకృష్ణయ్య, గుజ్జర్లమూడి సాంబయ్య, పడమట నరేష్, వెంగళ్ల శివయ్య, టి.శివరామకృష్ణ, వెంగళ్ల రంగారావు, సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పులెన్నో నిజం చెప్పండి

- ఉద్యోగస్తులు, కాంట్రాక్టర్లు, విద్యుత్ సంస్థల బకాయిలెంత?
- ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్లకు ఖర్చెంత?
- ప్రజల ముందు ఉంచాలని కోరుతూ బుగ్గనకు యనమల లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ నాటికి రాష్ట్ర అప్పుల వాస్తవ పరిస్థితిని, ఉద్యోగస్తులు, కాంట్రాక్టర్లు, విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ల నుంచి ఆయా వర్గాల పథకాలకు ఖర్చు చేసిన వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి శాసనమండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు శనివారం లేఖ రాశారు. ఆ లేఖ ఇలావుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని రాష్ట్ర ప్రజలందరూ నమ్ముతున్నారు. కాగ్ 2021-22 ఆడిట్ నివేదికలో ఇచ్చిన గణాంకాలను చూసిన తరువాత ఈ ఏడాది ఆగస్టు 23న తాను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్. రావత్‌కి ఒక లేఖ రాసి కొంత సమాచారాన్ని కోరాను. మండలి ప్రధాన ప్రతిపక్షనేతగా ఉన్న నాకు ఆర్థిక శాఖ కార్యదర్శి నుంచి ఏ విధమైన సమాధానం రాకపోవడం శోచనీయమని మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. కాగ్ 2021-22 నివేదిక ప్రకారం మీరు ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత మూడేళ్లలోనే రూ.3.25 లక్షల కోట్లు అప్పు చేశారని, అప్పు /స్థూల ఉత్పత్తి నిష్పత్తి 40 నుంచి 45 శాతం వరకు ఉందని చూసి ఆశ్చర్యపోయాను. ఐదు సంవత్సరాల టీడీపీ పాలనలో రూ.1.39 లక్షల కోట్లు అప్పు చేస్తే ప్రతిపక్షంలో ఉన్న మీరు రాష్ట్ర పరిస్థితి గురించి అసెంబ్లీ సాక్షిగా ఎంత ఆందోళన చెందారో నాకు ఇప్పటికీ గుర్తుంది. అటువంటిది మూడు సంవత్సరాలలో రెండున్నర రెట్లు అప్పు చేయడమే కాకుండా ఎంత అప్పు చేశారనేది కాగ్ కూడా తన నివేదికలో మార్చుకునే పరిస్థితి వచ్చిందంటే గణాంకాలను తప్పుగా చూపిస్తున్నారని అర్థమౌతోంది. 2021-22 ఆడిట్ తరువాత సంవత్సరన్నర కాలంలో సుమారు రూ.1.25 లక్షల కోట్లు అప్పు చేశారు. అంటే నాలుగున్నర సంవత్సరాలలో 4.5 లక్షల కోట్లు అప్పుతో ఈ ప్రభుత్వం నడుస్తోంది. ఇంతే కాకుండా 97 పబ్లిక్ సెక్టార్ సంస్థలకు కేవలం 30 సంస్థలు మాత్రమే ఆడిట్ కు లెక్కలు సమర్పించాయని కాగ్ ఆక్షేపించింది. లక్ష కోట్ల రూపాయల అప్పును ప్రతి యేటా చేస్తూ వచ్చే సంవత్సరం నుండి (2024-25) సంవత్సరానికి రూ.50 వేల కోట్లకు మించిన చెల్లింపుల భారాన్ని ప్రజల మీద పెట్టారని కాగ్ చెబుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరాలను తెలియజేయాలని కనీసం కాగ్ లెక్కలను నిర్ధారించాలని నేను ఆర్థిక శాఖ కార్యదర్శిని కోరాను. ఆయన నిర్లిప్తత నా అనుమానాలను మరింత బలపరుస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గురించి తెలుసుకోవడం ప్రజల హక్కు. ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ లో ప్రతిపక్ష నాయకుడి హోదాలో మీకు నా విన్నపం. మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక పరిస్థితులపై శ్వేత పత్రాన్ని ప్రచురించి గత ప్రభుత్వం కంటే ఎంతో మిన్నగా పరిపాలన కొనసాగిస్తామని మీరు చెప్పిన మాటలు నాకు ఇంకా గుర్తున్నాయి. పైన కోరిన విషయాలను ప్రజా క్షేత్రంలో ఉంచగలిగితే ప్రభుత్వ పరిపాలనపై ప్రజలు బేరీజు వేసుకునే అవకాశం ఉంటుంది. నా లేఖకు త్వరలోనే సమాధానం ఇస్తారని ఆశిస్తున్నానంటూ యనమల లేఖను ముగించారు. గతంలో కేంద్ర ఆర్థిక కార్యదర్శికి రాసిన లేఖను కూడా దీనికి జత చేసి పంపారు.

ఉపాధి సృష్టించేలా పాలిటెక్నిక్ విద్య

నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్

విశాలాంధ్ర-విజయవాడ: ఉపాధి సృష్టించేలా పాలిటెక్నిక్ విద్య రూపాంతరం చెందాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ, సాంకేతిక విద్యా, శిక్షణా మండలి సంయుక్త అధ్వర్యంలో శనివారం విజయవాడలో 'ప్రపంచవ్యాప్త పోటీతత్వం దిశగా పాలిటెక్నిక్ విద్యా విధానం మార్పు' అనే అంశంపై ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజానికి పాలిటెక్నిక్ విద్యార్థుల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. పాలిటెక్నిక్ అంటే ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం అనే ధోరణిని విడనాడి స్వతంత్ర పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తన కెరీర్‌ను అద్భుతంగా మలుచుకునేందుకు ఆన్ లైన్ అప్‌డేటెడ్ కోర్సులు నేర్చుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి విద్యా సంవత్సరం చివరి నాటికి ఒక ఆర్టికల్ రాయ గలిగిన స్థాయిలో తీర్చిదిద్దబడాలని తెలిపారు. భారత్ వంటి దేశాలలో మానవ వనరుల కొరత లేదని, ఇది రానున్న కాలంలో మనకు మరింతగా అంతర్జాతీయ ఉపాధిని అందిస్తుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, సాంకేతిక విద్యా, శిక్షణా మండలి చైర్మన్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రపంచ పారిశ్రామిక రంగంలో అత్యుత్తమ ఉద్యోగులుగా నిలిచేలా జాతీయ విద్యా విధానం-2020 రూపుదిద్దుకుందన్నారు. ఎన్ఎస్‌క్యూఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా యాడ్ ఆన్ కోర్సులను రూపొందిస్తున్నామని, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆ కోర్సుల్లో ఇంటెన్సివ్ ట్రైనింగ్ పొందే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యా శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, సాంకతిక విద్యా శిక్షణా సంస్థ సంయుక్త కార్యదర్శి (అకడమిక్) జి.వి.వి.ఎస్.మూర్తి, అదనపు సంచాలకులు వి.పద్మారావు, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి కె.వి.రమణబాబు, ఏయూ రీజియన్ ఆర్జేడీ సత్యనారాయణమూర్తి, ఎస్వీయూ రీజియన్ ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ, కేంద్ర కార్యాలయం ఉన్నతాధికారులు విజయభాస్కర్, జానకిరామ్, కళ్యాణ్, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతి త్వరలో ఫార్మసీ కౌన్సెలింగ్: నాగరాణి

ఫార్మసీ కళాశాలల అనుమతి పొడిగింపునకు ప్రభుత్వం అంగీకరించినందున రాష్ట్రంలోని బీ ఫార్మసీ, ఫార్మ్-డీ కోర్సుల అడ్మిషన్ షెడ్యూల్‌ను అతి త్వరలో విడుదల చేయనున్నామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎంపీసీ అభ్యర్థులకు తొలుత 5 రోజుల పాటు ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తామని, ఎంపీసీ అభ్యర్థులకు సీట్ల కేటాయింపు జరిగిన వెంటనే బైపీసీ విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. బీఫార్మసీ, ఫార్మ్-డీ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలతో సిద్ధంగా ఉండాలని కన్వీనర్ వివరించారు. ఒకసారి షెడ్యూల్ విడుదలైన తరువాత ప్రక్రియ వేగంగా ముగుస్తుందని తెలిపారు.

గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరరావు

విశాలాంధ్ర-దుగ్గిరాల: రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నందున గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శనివారం మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల శివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా సమితి అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో వీరయ్య, సచివాలయ కార్యదర్శికి అనేక డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరయిన ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనావృష్టి కారణంగా ఈ సంవత్సరం తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, ముఖ్యంగా రాయలసీమతో పాటు ప్రకాశం,, ఉత్తరాంధ్ర జిల్లాలలో అత్యంత దారుణంగా కరువు నెలకొందని అన్నారు. డౌన్ టు ఎర్త్ సంస్థ విశ్లేషణ ప్రకారం ఆంధ్ర ప్రదేశ్‌లో కోస్తా తీరం వెంబడి ఉన్న జిల్లాల్లో కూడా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొందన్నారు. వ్యవసాయ పనులు లేక గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నప్పటికీ కరువు నుంచి పేదలను, వ్యవసాయ కూలీలను, రైతులను విముక్తి చేసి, వలసలు ఆపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయ కూలీలకు, రైతులకు ఉపాధి చూపి ఆకలి తీర్చి, వలసను ఆపి, ఆర్థిక చేయూతనందించాల్సిన పాలకులు మీనమేషాలు లెక్కపెడుతున్నారని అన్నారు. కరువును అంచనా వేయడంలో, కూలీలను, రైతులను ఏ విధంగా ఆదుకోవాలనే విషయంలో అధికారులు ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించలేదని విమర్శించారు. తక్షణమే పరిస్థితులను అంచనా వేసి కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షులు యార్లగడ్డ శివయ్య మాట్లాడుతూ తక్షణమే వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు ప్రారంభించి, వలసలను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుర్రంకొండ సత్యానందం, బర్ల శ్రీను, పంతగాని మరియదాసు, కంభంపాటి దేవునిదయ, గుమ్మా గంగమ్మ, చాదర్ల తిరుపతమ్మ, లక్ష్మీ దుర్గా, భాగ్యలక్ష్మి, కృష్ణారావు, ధనలక్ష్మి, తిరుపతమ్మ, భూలక్ష్మి కోటేశ్వరరావు, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పొలం బాట పట్టాలి

- రైతు పరిస్థితి దుర్భరం
- ఎకరాకు రూ.లక్ష పంట నష్ట పరిహారం ఇవ్వాలి: గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అన్నదాత పరిస్థితి దుర్భరంగా మారిందని, సీఎం జగన్ ఇప్పటికైనా పొలం బాట పట్టాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు సూచించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి కర్నూలు జిల్లాలలోని కొన్ని ప్రాంతాల పొలాలు ఎడారిని తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి కర్నూలు ప్రాంతాల్లో తాను పర్యటించిన సందర్భంగా రైతాంగం ఎదుర్కొంటున్న కష్టాలు చూశానని అన్నారు. ఆలూరు ప్రాంతంలో నాలుగున్నర ఎకరాల వేరు శనగ రైతు తనతో మాట్లాడుతూ ఎకరాకు దాదాపు రూ.40 వేలు పెట్టుబడి పెట్టినా చిల్లిగవ్వ చేతికందలేదని, వర్షాభావంతో పంట మొత్తం నష్టపోయినట్లు వెల్లడించాడని తెలిపారు. ఆలూరు ప్రాంతంలోనే దాదాపు 20 మంది వరకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. ఎకరాకు రూ.లక్ష పంట నష్ట పరిహారాన్ని రైతన్నలకు అందజేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 40 లక్షల ఎకరాల్లో ఇంతవరకు సాగు వేయలేదన్న విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. దేశానికే కాకుండా వ్యవసాయాధారిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అన్నదాత వెన్నుముక అని గుర్తుచేశారు. చిక్‌బళ్లాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన 13 మంది బాధిత కుటుంబీకులకు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ తరపున గిడుగు రుద్రరాజు సానుభూతి వ్యక్తం చేశారు.

నేడు గుంటూరులో ఓబీసీ సదస్సు

కులగణనతోనే వెనుకబడిన వర్గాల వారికి సాధికారత లభిస్తుందని, ఈనెల 29వ తేదీ ఆదివారం గుంటూరులో ఓబీసీలతో భారీ సమావేశం నిర్వహిస్తున్నట్లు రుద్రరాజు వెల్లడించారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ, ఓబీసీ డిపార్ట్ మెంట్ చైర్మన్, మాజీ మంత్రి కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్‌తో పాటు సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ముఖ్య అతిథులుగా ఈ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. బీసీ సాధికారత, కులగణన తర్వాత వారికి లభించే మరింత మెరుగైన సంక్షేమం వంటి అంశాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అదే విధంగా నవంబరు 9, 10, 11 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో ఓబీసీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పడిన నేపథ్యంలో ఈ నెల 30న విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో నూతన కార్యవర్గం భేటీ అవుతుందన్నారు. పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొనే ఈ సమావేశానికి ఏఐసీసీ నుంచి ఆంధ్ర ప్రదేశ్ బాధ్యులు క్రిష్టోఫర్ తిలక్, మయప్పన్ హాజరవుతారని ఆయన వెల్లడించారు.

సంపాదకీయం

యుద్ధోన్మాద ఇజ్రాయిల్‌కు మోదీ అండ

హమాస్‌ను తుడిచిపెట్టే లక్ష్యంతో గాజా మీద ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధం మానవతావాద దృష్టితో నిలిపివేయాలని ఐక్యరాజ్యసమితి సాధారణ సభ తీర్మానం ఆమోదించింది. జోర్డాన్ ప్రతిపాదించిన ఈ తీర్మానానికి అనుకూలంగా 120 దేశాలు ఓటు వేశాయి. అమెరికాతో సహా 14 దేశాలు ఈ తీర్మానాన్ని వ్యతిరేకించాయి. భారత్‌తో సహా 45 దేశాలు తీర్మానంమీద ఓటు వేయకుండా గైరుహాజరయ్యాయి. గాజా ప్రజలకు మామవతావాద దృక్పథంతో సహాయం అందించాలని కూడా ఈ తీర్మానంలో కోరారు. సహాయం అందించడానికి వచ్చిన వందలాది లారీలు జోర్డాన్ సరిహద్దులో నిలిచిపోయి ఉన్నాయి. వాటిని ఇజ్రాయిల్ అనుమతించడం లేదు. ఈ తీర్మానానికి కెనడా ఓ సవరణ ప్రతిపాదించింది. తీర్మానంలో హమాస్‌ను "తీవ్రవాదం" అన్న మాట సవరించాలని పాటు హమాస్ బందీలుగా ఉంచిన వారిని వెంటనే విడుదల చేయాలని ఉంది. ఈ సవరణను ఎక్కువ దేశాలు సమర్థించకపోవడంతో తీర్మానం వీగిపోయింది. అక్టోబర్ ఏడున హమాస్ ఇజ్రాయిల్ మీద వేలాది రాకెట్లు ప్రయోగించిన వెంటనే ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించింది. దాదాపు పక్షం రోజులు గాజాపై వైమానిక దాడులు కొనసాగించిన ఇజ్రాయిల్ గురువారం నుంచి గాజా భూభాగంలోకి తన సేనలను నడిపిస్తోంది. యుద్ధం ఇంకా కొనసాగుతుందని కూడా ప్రకటించి తన యుద్ధోన్మాదాన్ని మరోసారి చాటుకుంది. ఇజ్రాయిల్ ఉత్తర ప్రాంతంలోని లెబెనాన్ నుంచి హిజ్బుల్లా కార్యకర్తలు రాకెట్లు ప్రయోగిస్తూనే ఉన్నారన్న మిషతో లెబెనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై కూడా ఇజ్రాయిల్ యుద్ధం కొనసాగిస్తోంది. హిజ్బుల్లాకు ఇరాన్ మద్దతు ఉంది. హిజ్బుల్లా కార్యకర్తలకు, ఇజ్రాయిలీ సేనలకు మధ్య భీకర సమరం సాగుతోంది. దీనివల్ల 28,965 మంది నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. లెబెనాన్ గడ్డ మీంచి భూమి మీద నుంచి ఆకాశంలోకి ప్రయోగించే రాకెట్ల దాడిని వమ్ము చేశామని ఇజ్రాయిల్ సైన్యం అంటోంది. రాకెట్లను ప్రయోగించే కేంద్రాన్నే ధ్వసంచేశామని కూడా తెలియజేసింది. మరోవేపు గాజా నది పశ్చిమ తీరంలో ఉన్న శరణార్థుల శిబిరంమీద ఇజ్రాయిల్ దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేసింది. వీరిలో ఒకరు ఈడు బాలుడు. రమల్లా నగరానికి ఉత్తరాన ఉన్న ఒక రెండంతస్తుల భవనాన్ని కూడా ఇజ్రాయిలీ సేనలు పడగొట్టాయి. ఆ భవనానికి అనుమతి లేనందువల్ల పడగొట్టామని అంటున్నారు. గాజా స్ట్రిప్ ఉత్తర భాగంలోని అల్-షిఫా ఆసుపత్రి పరిసరాల్లో కూడా ఇజ్రాయిల్ దాడులు కొనసాగించింది. ఈ ఆసుపత్రే హమాస్ తీవ్రవాదుల శిబిరం అన్ని ఇజ్రాయిల్ చెప్తోంది. శుక్రవారం సాయంత్రం ఈ దాడులు కొనసాగాయి. ఇంకోవేపు ఇజ్రాయిల్‌లో పనిచేసే గాజా నివాసుల జాడ యుద్ధం మొదలైనప్పటి నుంచి తెలియడంలేదు. వారిని ఎక్కడైనా బంధించి ఉండొచ్చు లేదా కొందరినైనా హతమార్చి ఉండొచ్చుననుకుంటున్నారు. పదాతి దళాలు, సాయుధ శకటాలు గాజా మీద కొనసాగిస్తున్న దాడిలో పాల్గొంటున్నాయని ఇజ్రాయిల్ సైన్యం ప్రతినిధి అన్నారు. వైమానిక దాడులు భీకరంగా కొనసాగుతున్నాయి. గాజాకు విద్యుత్ సరఫరా కూడా నిలిపివేసినందువల్ల చిమ్మ చీకటి ఆవరించింది. బాంబులు ప్రయోగించడంవల్ల రేగుతున్న దుమ్ము మాత్రం సర్వత్రా వ్యాపించింది. గాజాస్ట్రిప్ ఉత్తర భాగంలోని రక్తశుద్ధి కేంద్రం చుట్టూ బాంబుల వర్షం కురుస్తూనే ఉంది. దక్షిణాన రఫా పట్టణానికి తూర్పున కూడా పేలుళ్లు కొనసాగుతున్నాయి. తుపాకీ తూటాలు పేలుతున్న ధ్వని నిరంతరం వినిపిస్తోంది. ఇజ్రాయిల్ రెండోదశ యుద్ధం కొనసాగిస్తున్నట్టు కనిపిస్తోంది. 150 తీవ్రవాదులు తవ్విన సొరంగాలను యుద్ధ విమానాల ద్వారా ధ్వసం చేశామని కూడా ఇజ్రాయిల్ సైన్యం తెలియజేసింది. ఈ దాడిలో హమాస్ ఏర్పాటు చేసుకున్న భూగర్భ స్థావరాలు ధ్వసం అయ్యాయని అనేకమంది హమస్ తీవ్రవాదులు అంతమయ్యారని కూడా ఇజ్రాయిల్ చెప్తోంది. నిజానికి గాజా మీద యుద్ధం గురించిగానీ, అక్కడ జరుగుతున్న విధ్వంసం, ప్రాణనష్టంగానీ బయటి ప్రపంచానికి పెద్దగా తెలియడంలేదు. గాజాలో ఉన్న ప్రజలకు కూడా ఏమీ తెలిసే అవకాశం లేకుండాపోయింది. ఫోన్లు, ఇంటర్నెట్ సదుపాయం మొదలైనవన్నీ ఇజ్రాయిల్ దాడుల్లో ఛిన్నాభిన్నం అయినాయి.

గాజా ప్రజలు తమ ఆత్మీయులను, దక్షిణ గాజా వెళ్లిపోయిన తమ కుటుంబ సభ్యులను పలకరించే అవకాశంగానీ, గాజాలో మిగిలినవారు సజీవంగా ఉన్నారో లేదో తెలుసుకునే అవకాశంకూడా లేదు. దాడుల్లో మరణించగా మిగిలిన క్షతగాత్రులను ఆసుపత్రులకు చేర్చడానికి వైద్య సహాయక వాహనాలు కూడా రావడానికి కూడా అవకాశాలు పెద్దగా లేవు. గాజాలో ఉన్న పలస్తీనియన్లు సంపూర్ణమైన అంధకారంలో బతుకీడుస్తున్నారు. బాంబుల మోత తప్ప అక్కడా అంతా నిశ్శబ్దమేనని ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆహార పథకం అధిపతి అంటున్నారు. టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసం అయిపోవడంతో అక్కడ ఐక్యరాజ్య సమితి తరపున పనిచేస్తున్న వారిని సంప్రదించే అవకాశంకూడా లేకుండా పోయింది. ఇజ్రాయిల్ మీద దాడి జరిగిన వెంటనే ఆ దాడిని ఖండించడంతో ఊరుకోకుండా హమాస్ మీద తీవ్రవాదులు అన్న ముద్రవేసి ఇజ్రాయిల్‌కు పూర్తి మద్దతు ప్రకటించిన భారత్ ఐక్యరాజ్యసమితిలో యుద్ధ విరమణకోసం ప్రతిపాదించిన తీర్మానంపై ఓటింగ్‌లో పాల్గొనకుండా గైరుహాజరైంది. దశాబ్దాలుగా పలస్తీనాకు మద్దతు ఇస్తున్న భారత విదేశాంగ విధానాన్ని ప్రధానమంత్రి మోదీ ఒక్క దెబ్బతో మార్చేశారు. అందువల్ల యుద్ధ విరామంకోసం ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆమోదించడంలో ఆశ్చర్యపడవలసింది ఏమీలేదు. కానీ మోదీ ప్రభుత్వం ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని ఆమోదిస్తోందని స్పష్టం అయింది. ఐక్యరాజ్య సమితి తీర్మానంలో హమాస్ ప్రస్తావన లేనందువల్ల, ఆ సంస్థను "తీవ్రవాద" సంస్థ అనకపోవడంవల్ల గైరుహాజరు అయ్యారట. హమాస్ లాంటి సంస్థకు స్పష్టమైన సంకేతాలు ఇవ్వాల్సి ఉందన్నది ఐక్యరాజ్యరాజ్య సమితిలో భారత ప్రతినిధి వాదన. హమాస్ మీద ఉన్న ఆగ్రహం కారణంగా ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న భయంకరమైన యుద్ధాన్ని భారత్ సమర్థించడం మారిన మన విదేశాంగ నీతికి రుజువు. ఇజ్రాయిల్ యుద్ధం వల్ల ఇప్పటికి కనీసం ఏడువేల మంది పలస్తీనియన్లు మరణించారని అంచనా. హమాస్ అర్థ రహిత రాకెట్ల దాడిని సమర్థించనక్కర లేదు. కానీ హమాస్‌ను ఆ పరిస్థితిలోకి నెట్టిన ఇజ్రాయిల్ దాష్టీకాన్ని సమర్థించడం అమానవీయం. ఐక్యరాజ్య సమితి తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన అమెరికా కూడా ఇదే మాట అనడం యాదృచ్ఛికం కాదు. పలస్తీనియన్ల భూభాగాన్ని ఆక్రమించి ఇజ్రాయిల్ దేశాన్ని ఏర్పాటు చేసిన పశ్చిమ దేశాల అలనాటి కుట్రలను మన దేశం మునుపెన్నడూ సమర్థించలేదు. ఎప్పుడూ పలస్తీనాకు అండగానే నిలబడ్డాం. కానీ బీజేపీ పాలన రణోన్మాదులను కీర్తించే స్థాయికి దిగజారింది. అసలు ఇజ్రాయిలే ఒక తీవ్రవాద దేశం అని గుర్తించడానికి నిరాకరిస్తోంది. భీకర దాడులు జరుగుతున్నప్పటికీ పలస్తీనియన్లు ఆత్మస్థైర్యం కోల్పోలేదు. గాజా ఈశాన్య నగరమైన బీట్ హనౌన్, అల్-బురేజీలో ఇజ్రాయిల్ సేనలతో పోరాడుతున్నామని హమాస్ ప్రకటించింది.

నాటి సరస్వతి నిలయాలు నేటి అజ్ఞాన కేంద్రాలు

కేంద్రప్రభుత్వ అశాస్త్రీయమైన విధానాలు, జీవంలేని విద్య ప్రమాణాలుతో నైపుణ్యంలేని సమాజాన్ని తయారు చేస్తూనేఉంది. అర్హమైన పనివాళ్లు లేక ప్రభుత్వ విశ్వవిద్యాలయాలల్లో దశాబ్దకాలంగా శ్మశాన ప్రశాంతత నెలకొంది. ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో నియామకాలు మరచి పదిహేను సంవత్సరాలయ్యింది. మెరుగైన జీతాలులేక ప్రభుత్వ ఉపాధ్యాయులు, జీతాలే లేక ప్రైవేటు ఉపాధ్యాయులు కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఈ సంక్షోభం ఇక్కడితో ఆగదు, అజ్ఞాన సమాజంలో వికృతరూపాలుతో సామాజిక సంక్షోభం రాబోతున్నది. ఇప్పుడైనా ప్రభుత్వ సలహాదారులు, ఉపకులపతులు, విద్యా రంగంలోని నిష్ణాతులు, మేధావులు, ఉపాధ్యాయులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు మంచి జీతాలు ఇచ్చి శాస్త్రీయమైన పర్యవేక్షణ ఏర్పాటుచేసి విలువలుతో కూడిన విద్య ప్రమాణాలును తీసుకొని రావాలి. దశాబ్దకాలంగా ఒక్కటంటే ఒక్క రీసర్చ్ ప్రాజెక్టు రాలేదంటే మన విశ్వవిద్యాలయాల ఘనత వేరే చెప్పనక్కర్లేదు. గతమెంతో ఘనకీర్తి దశాబ్దాలచరిత్ర కలిగిన విశ్వవిద్యాలయాలు నేడు నిర్మానుష్యంగా ఉన్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్ల గడుస్తున్నా ఒక్క బోధనా సిబ్బంది పోస్టు భర్తీ చేయకపోగా, ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఇబ్బడి ముబ్బడిగా శాంక్షన్‌చేసి విద్య తమ బాధ్యత కాదని చేతులు దులుపుకుంది. శతాబ్దంకిందట వెలసిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యాభైసంవత్సరాల క్రిందట 52 విభాగాలు ఆరువందల మంది బోధనా సిబ్బంది ఉండేవారు. ఇప్పుడు కేవలం 24 విభాగాలు పట్టుమని ఎనభైమంది సిబ్బందితో, విభాగాలు ఉన్నాయా అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇక పదిహేనుసంవత్సరాల క్రిందట వెలసిన తెలంగాణ విశ్వవిద్యాలయం, పాలమూరు యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, జేఎన్టీయూ, ట్రిపుల్ ఐటీలో బోధనా సిబ్బందిలేదు. ఇలాగే మరికొద్దికాలం గడిస్తే అన్నివిభాగాలు మూసుకోవాల్సిందే. కీలకమైన విభాగాలలో బోధనేతర సిబ్బందిలేరు. పరీక్షల విభాగం, కాలేజీ డెవలప్మెంట్‌సెల్, కాన్ఫిడెన్షియల్ పనులు కూడా కాంట్రాక్టు సిబ్బంది చేతుల్లోకి వెళ్ళి చాలాకాలం అయ్యింది. కళాశాలలను తనిఖీలు చేయాలన్న కనీసం ఎనిమిదివందలమంది అధ్యాపకులు కావాలి. అలాగే సెలక్షన్ కమిటీ తూతూ మంత్రంగా జరపాలన్న ఐదువందల మంది అధ్యాపకులు కావాలి. ఉన్న అధ్యాపకులు ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్, రెక్టార్, డీన్, డైరెక్టర్ అడ్మిషన్స్, అకడమిక్ ఆడిట్, ప్లానింగ్, రీసర్చ్, ఎవాల్యుయేషన్, కాంట్రొల్లర్, అసిస్టెంట్ కంట్రోలర్, వైస్‌ప్రిన్సిపాల్, వార్డెన్, ప్లేస్మెంట్ ఆఫీసర్, అకడమిక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్ ఇలా ప్రతి ఒక్కరికి రెండు లేదా మూడు పోస్టులు అదనంగా ఉంటున్నాయి. వీళ్ళు బోధన మరచి చాల రోజులయ్యింది. ఒక్కటంటే ఒక్క రీసర్చ్ గ్రాంటు కు రిపోర్టు రాయడం చేతకాదు. మైనర్, మేజర్, టెక్విప్, స్టార్ట్ అప్ గ్రాంట్లు రావడంలేదు, యూనివర్సిటీ కళాశాలల్లో పరిశోధనలు పడకేసి చాలాకాలమైంది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీకి సెంట్రలైజ్డ్ కామన్ రిక్రూట్‌మెంట్‌బోర్డు ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించి ఏడాది అయింది. విశ్వవిద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులభర్తీని ఈ బోర్డు చేపట్టనుంది. ప్రస్తుతం యూనివర్సిటీలు వేర్వేరుగా ఖాళీలను భర్తీ చేస్తున్నాయి. వేర్వేరుగా కాకుండా అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉన్న ఖాళీలను ఒకే బోర్డు ద్వారా ఒకేసారి భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

గవర్నరు కొత్తపద్ధతిలో చిక్కులు ఉంటాయని అది యూజీసీ కి విరుద్ధంగా ఉన్నట్లు తనకు తోచిందని తక్షణమే విద్యాశాఖ మంత్రి రాజభవన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం మెడికల్ యూనివర్సిటీలు కాకుండా 15విశ్వవిద్యా లయాలున్నాయి. ఈ విశ్వ విద్యాలయాల్లో ఖాళీల భర్తీకి వేర్వేరుగా నోటిఫికేషన్స్ విడుదలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్న తర్వాత నియామకాలు చేపడుతున్నాయి విశ్వవిద్యాలయాలు. వేర్వేరుగా రిక్రూట్‌మెంట్స్ చేయడం వల్ల కొన్ని సమస్యలు వస్తున్నాయి. నిరుద్యోగులు కూడా ప్రతీ యూనివర్సిటీకి అప్లై చేయాల్సి వస్తోంది. ఇలా పలు అంశాలను, సమస్యల్ని పరిశీలించిన తెలంగాణ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో నియామకాలు వేర్వేరుగా కాకుండా ఈ 15యూనివర్సిటీల్లో ఖాళీలభర్తీ ఒకేబోర్డు ద్వారా జరపాలని భావించింది. అందుకే కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌గా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఉంటారు. కన్వీనర్‌గా కళాశాల విద్యా శాఖ కమిషన్ మెంబర్ ఉంటారు. ఆర్థిక శాఖ, విద్యాశాఖ అధికారులు బోర్డు సభ్యులుగా ఉంటారు. కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు విధివిధానాలు ఎలా ఉంటాయన్నదానిపై మార్గదర్శకాలు విడుదల కాలేదు. ఈ బోర్డు పనిచేయడానికి అయ్యే ఖర్చుల్ని తెలంగాణ ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీలు సమానంగా భరిస్తాయి. ఈ బోర్డు ఏర్పాటు చేసేందుకు యూనివర్సిటీ చట్టాల్లో సవరణలను కూడా ప్రతిపాదించనుంది ప్రభుత్వం. ఏదో ఒక రూపాన ఉద్యోగం దక్కితే చాలని అభ్యర్థులు వేయికళ్లతో ఎదురు చూశారు. రిజర్వేషన్ రోస్టర్ ఎలా పాటిస్తారన్న సందేహం బిసి, ఎస్సి,ఎస్టీ వర్గాల విద్యార్థులు ఆందోళన చెందారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ పరిగణలోకి తీసుకుంటారా లేదా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. లాస్ట్ రోస్టర్ పాయింట్ ఎక్కడ నిలిచింది ఇప్పుడు ఎక్కడ నుండి మొదలవుతుంది అలాగే లోకల్ నాన్‌లోకల్ సమస్య రాకుండా చూడాలి. తీవ్ర కాలయాపనచేసి, వాటిపై తమపార్టీ వారినే కోర్టులో కేసులు వేసి నాన్చే ధోరణి అవలంబిస్తు, నియామకాలపై చిత్తశుద్ధిలేక విశ్వవిద్యాలయాలు శాశ్వతంగా మూసుకోవాల్సినస్థితికి తీసుకొచ్చారు. ఇక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల పరిస్థితి ఎలా ఉందంటే ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారింది.

సురేష్

ఉద్యమాల సారథి ఏఐటీయూసీ

అమర్‌జీత్ కౌర్

బ్రిటీష్ వలసపాలకుల దోపిడీకి,అణచివేతకు, బలవంతంగా భూముల ఆక్రమణకు వ్యతి రేకంగా కార్మికులు, కర్షకులు, గిరిజనులు తిరుగుబాటు ఉద్య మాలు 19వశతాబ్ది ప్రారంభంలోనే చోటు చేసుకున్నాయి. ఈ దశలోనే దేశవ్యాప్తంగా వివిధరంగాలలో ఏర్పడిన ట్రేడ్‌యూనియన్లన్నీ కలిసి 1920 అక్టోబరు 3న బాంబేలో (ముంబై) ఏఐటీయూసీ స్థాపన జరిగింది. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న గొప్పయోధుడు లాలాలజపతిరాయ్ ఏఐటీయూసీ మొదటి అధ్యక్షుడిగా వ్యవస్థాపక మహాసభ జరిగింది. సంఘటిత, అసంఘటితరంగాల కార్మికులు వలస పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమానికి సిద్ధమయ్యారు. భారతదేశ కార్మికవర్గ చరిత్రలో పథమ సమ్మె 1827లో జరిగింది. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాలు, తిరుగుబాట్లు జరుగుతున్న దశలో 1957 స్వాతంత్ర్యంకోసం జరిగిన ప్రథమ యుద్ధం నావికులు తిరుగుబాటు. అయితే ఉద్యమాన్ని బ్రిటీషు పాలకులు అణచివేశారు. అనంతరం 1860ల మధ్య కార్మికులు వీధుల్లోకి వచ్చారు. వివిధరంగాల కార్మికులను సంఘటితంచేసే ప్రయత్నాలు జరిగాయి. వివిధరంగాల కార్మికుల ఆధారంగా 1870ల నుండి సంఘటిత యూనియన్లు ఏర్పాటుకావడం ప్రారంభమైంది. దేశంలో పనిగంటలు తగ్గించాలన్న డిమాండ్ మొదలైంది.

1908లో బాలగంగాధర తిలక్‌ను అరెస్టు చేసినప్పుడు ఆయనను విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ దేశమంతటా నిరసన ప్రదర్శనలు జరిగాయి. అప్పుడు ఆరురోజులు ముంబైను బంద్ చేశారు. ఆరేళ్ళ శిక్ష విధిస్తామని బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటన చేసిన తర్వాతనే బంద్ విరమించారు. స్వాతంత్ర్యోద్యమం కార్మికుల పోరాటాలపై బలంగా ప్రభావాన్ని చూపింది. దోపిడీదారులకు వ్యతిరేకంగా సామూహిక పోరాటాలు కార్మికులు నిర్వహించారు. ఏఐటీయూసీ రెండవ మహాసభ ఝరియాలో జరిగింది. 1919లో అమృతసర్‌లో జలియన్‌వాలాబాగ్ దురంతం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా అనేక ప్రాంతాలలో గొప్ప నిరసన ప్రదర్శనలు జరిగాయి. మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ మహాసభలో సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని డిమాండ్‌చేస్తూ తీర్మానం ఆమోదించారు. ఈ డిమాండ్‌ను ఆమోదించడమేకాకుండా పనిగంటలు తగ్గించాలని, కనీస వేతనాలను ఇవ్వాలని, పనిప్రదేశాలలో భద్రత, సామాజిక భద్రతకు, పోరాటాల హక్కునకు, భావప్రకటనా స్వేచ్ఛకు, నిరసన హక్కుకోసం కార్మికులు డిమాండ్ చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశాలు జరిగిన ప్రతిచోటా సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం చేయాలని కార్మికులు పెద్దసంఖ్యలో వెళ్లి డిమాండ్ చేశారు. ఇండియాలో సోషలిజం స్థాపించాలన్న లక్ష్యంతో 1921లో జరిగిన ఝరియా ఏఐటీయూసీ మహాసభ ఒక ప్రణాళికను ఆమోదించింది. కమ్యూనిస్టులతోసహా (అప్పటికి కమ్యూనిస్టుపార్టీ ఏర్పడలేదు) అన్ని రాజకీయ విభాగాలకు చెందిన నాయకులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. కమ్యూనిస్టుపార్టీని 1925 డిసెంబరు 26న స్థాపించారు. గొప్పవీరుడు భగత్‌సింగ్ అసెంబ్లీపై బాంబు వేసినప్పుడు కార్మికవర్గానికి అన్నిరాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలియజేశారు. వలసపాలకులుచేసిన క్రూరమైన వివాదాస్పద కార్మికచట్టాన్ని ఉపసంహరించాలని అసెంబ్లీలో కరపత్రాలను విసిరివేశారు. 1928లో ఏఐటీయూసీ అధ్యక్షుడిగాఉన్న జవహర్‌లాల్‌నెహ్రూ సైమన్ కమిషన్ భారతదేశ పర్యటనను నిరసిస్తూ ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ

వ్యవస్థాపక అధ్యక్షుడు లాలా లజపతిరాయ్‌పై లాఠీఛార్జి చేశారు. ఆయన గాయపడ్డారు.1929లో నేతాజీ సుభాస్ చంద్రబోస్ ఏఐటీయూసీ అధ్యక్షుడయ్యాడు. పాలకుల అడుగులకు మడుగులొత్తుతున్న మత విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సుభాస్ చంద్రబోస్ మిలిటెంట్ పోరాటాలను నిర్వహించారు. ఏఐటీయూసీ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా సిఆర్ దాస్, ఎన్ఎమ్ జోషి, ఎస్ఏ డాంగే, ఆర్ఎస్ రుయ్‌కర్, ఎస్ఎస్ మిరాజ్‌కర్, రణేన్‌సేన్, ఇంద్రజిత్‌గుప్తా, మణిబెన్‌కరా, ఏబి బర్దన్, శివనాథ్ బెనర్జీ, తెంగడి, దివాన్‌చమన్‌లాల్, జోసెఫ్ బాప్టిస్టా , సిఎఫ్ ఆండ్రూస్, జినేవాలా, ఆర్ఏ ఖండిగ్‌కర్, సురేష్ చంద్ర బెనర్జీ, హరిహరనాథ్ శాస్త్రి, విఎస్ చెట్టియార్, చతురానన్ మిశ్రా, కేవీ శ్రీవత్సవ, హెూమిదాజి, ఎమ్ఎస్ కృష్ణన్, కెఎల్ మహేంద్ర, జె చిత్తరంజన్, ప్రమోద్‌గగోయ్, గురుదాస్‌దాస్ గుప్తా పనిచేశారు. అనేక యూనియన్లకు ఏఐటీయూసీ కవచంలాంటి యూనియన్. రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పడినప్పుడు ఏఐటీయూసీ రాజ్యాంగంలో ఉండవలసిన అంశాలను సూచిస్తూ మెమొరాండాన్ని ముందుగా అందించింది. ఆర్థికవ్యవస్థ, స్వేచ్ఛ భారతంలో అభివృద్ధి లక్ష్యంపైన సహజవనరుల నిర్వహణ, ప్రజల శ్రమద్వారా సమీకృతమైన సంపద నిర్వహణపై చర్చకు ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటు, భారీ పరిశ్రమల నిర్మాణం, మౌలికసదుపాయాల అభివృద్ధి మొదలైన అంశాలు చర్చించడానికి మూడు కమిటీల ఏర్పాటుకు ఏఐటీయూసీ సమర్పించిన పత్రం ఆధారంగా ఉన్నది. నేడు అధికారంలో ఉన్న సైద్ధాంతిక శక్తుల పూర్వీకులు స్వావలంబన నమూనా అభివృద్ధిని పార్లమెంటు లోపల, వెలుపల వ్యతిరేకించారు. సైన్సు, సాంకేతికత, అణుశక్తి, అంతరిక్ష సాంకేతికత అభివృద్ధి దేశాభివృద్ధిలో భాగంగా ఉండాలన్న అంశాన్ని కూడా ఈ శక్తులు వ్యతిరేకించాయి. సోవియట్ యూనియన్‌సహా వివిధ దేశాలు అందించే సహాయాన్నికూడా ఈ శక్తులు గట్టిగా తిరస్కరించాయి. నేడు ప్రభుత్వ రంగ సంస్థలు తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. కార్మికచట్టాలను మార్చివేసి తిరోగమనమార్గంలో వాటిని నాలుగు కోడ్‌లుగా తయారుచేశారు. ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను రైతుల భూములను విదేశీ కార్పొరేట్లకు, కార్పొరేట్ సంస్థలకు, వ్యక్తులకు అప్పగించాలని తహతహలాడుతోంది. అంతేకాదు, ఆర్థికరంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. ఆర్థిక అసమానతలు తీవ్రతరమయ్యాయి. దివాళా కేసులు పెరుగుతున్నాయి. జీవనవ్యయం అధికమవుతోంది. కార్మికుల ఆత్మహత్యలు పెరిగాయి. ఏనాడూలేనంతగా నిరుద్యోగం అధికం కావడంతో యువకుల్లో ఆత్మహత్యలు పెరిగాయి. దేశంలో మెజారిటీ వృద్ధులకు పెన్షన్ల సహకారంలేదు. అలాగే ఈపీఎఫ్ 95 పథకం కింద పెన్షన్ రూ.500 నుండి రూ.1000లు మాత్రమే లభిస్తుంది. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదు. మరోవైపు కార్పొరేట్ రంగానికి చెందిన సంస్థలకు, వ్యక్తులకు పన్నులు తగ్గించారు. గత పదేళ్లకాలంలో కార్పొరేట్ శక్తులు తీసుకున్న దాదాపు 25లక్షల కోట్ల రుణ బకాయిలను ప్రభుత్వం రద్దుచేసి కుబేరులకు సహాయపడింది. కార్పొరేట్ల తెల్లధనాన్ని దోచుకునేందుకు చట్టాలను సవరించారు. జర్మనీ, బ్రిటన్,ఫ్రాన్స్ లాంటి దేశాలలో సంపన్నులను మించి మనదేశంలో సంపన్నులు ఉన్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రజాసమూహాలు నిరసన తెలియజేస్తున్నాయి. సాంస్కృతిక ఉద్యమాలు, విద్యార్థులు, యువత, మహిళలు ఇతర అణచివేతకు గురవుతున్న ప్రజలు ఉద్యమాలబాట పట్టారు. కార్మిక ఉద్యమాలు అధికమవుతున్నాయి. రైతులు మరోసారి రాజ్‌భవన్‌ల ముందు నిరసన ఉద్యమాలు చేపట్టనున్నాయి. 2023 నవంబరు 26,27,28 తేదీలలో ప్రదర్శనలు నిర్వహిస్తాయి. దేశంలో కేంద్రప్రభుత్వం సమాఖ్య వ్యవస్థను దిగజారుస్తున్నది. ప్రజాస్వామ్యానికి, బహుళమత విశ్వాసాలకు, సంస్కృతులకు, భాషలకు ప్రజలంతా సామరస్యభావనతో జీవించే సామాజిక విలువలకు వ్యతిరేకంగా విచ్ఛిన్నకర శక్తులను ప్రోత్సహిస్తున్నారు. విద్వేషాన్ని మరింత విస్తరిస్తున్నారు. మహిళలకు సమాన హక్కులను, ఆత్మగౌరవ జీవనాన్ని కాదంటున్నారు. వీటన్నిటినీ వ్యతిరేకిస్తున్న శక్తులను ఏఐటీయూసీ తిరస్కరిస్తున్నది. నిరసన తెలియజేస్తున్న వారిని, స్వేచ్ఛ, భావప్రకటనను కాదంటున్న శక్తులను ఏఐటీయూసీ దునుమాడుతున్నది. ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవమైన అక్టోబరు 31న మనమంతా గుర్తుచేసుకుంటూ ఈ సంస్థస్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలి. ఇండియన్ రిపబ్లిక్ స్వతంత్రను దెబ్బతీయాలన్న శక్తులను వ్యతిరేకించాలి. సెక్యులర్ ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడింది. నిస్సిగ్గుగా ఈ ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయిల్ వైపు నిలిచింది. ఈ రెండుదేశాల మధ్య వక్రబంధం ఉన్నప్పటికీ దాన్ని పట్టించుకోవడంలేదు. ఏఐటీయూసీ కార్యాలయాలముందు యూనియన్ పతాకాలను ఆవిష్కరించి నేటి కర్తవ్యాలను కార్మికులకు వివరించాలి. కార్మికుల, కర్షకుల, జాతివ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ 2024లో జరగనున్న లోకసభ ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని ఓడించాలని ఏఐటీయూసీ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నది.

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

నక్షత్ర పరిశోధనలో సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్

డాక్టర్ దేవరాజు మహారాజు

అక్టోబర్ 1983లో నోబెల్ పురస్కారం స్వీకరించిన సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ మనవాడు. దక్షిణ భారతానికి చెందిన వాడు. హైస్కూలు, కాలేజి చదువులు మద్రాస్ (చెన్నై)లో చదివినవాడు. అయితే నక్షత్రాల లెక్కలు గట్టి జ్యోతిష్యాలు చెప్పే భారతీయ జ్యోతిష పండితులకు కనీసం ఈయన పేరు కూడా తెలియదు. నక్షత్ర పరిణామాన్ని విప్పి చెప్పిన మేధానిని గూర్చి కనీసం తెలుసుకోరు. తమ అజ్ఞానంలో తాము ఉంటూ జనాన్ని మోసం చేస్తుంటారు. 1953 లో డా. చంద్రశేఖర్ అమెరికా పౌరసత్వం స్వీకరించి ఉండకపోతే ఆయన మన భారతీయ శాస్త్రవేత్త అని ప్రపంచానికి సగర్వంగా ప్రకటించుకునే వాళ్ళం. అది వేరే సంగతి! మనుషుల్లాగే నక్షత్రాలు పుడతాయి. ఎదుగుతాయి. ఆకాశంలో ప్రకాశిస్తాయి. చివరకు వినీలాకాశంలో నిబిడీకృతమైపోతాయి. నక్షత్రాల జీవిత చరిత్రల్ని వెల్లడించిన శాస్త్రజ్ఞులు ప్రపంచంలో కొద్ది మందే. వారు కొపర్నికస్, గెలీలియో, కెప్లర్, న్యూటన్ మొదలైన వారు. వారు వేసిన దారిలోనే పయనించి నోబెల్ బహుమతి సాధించినవాడు సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ (19 అక్టోబర్ 1910-21 ఆగస్టు 1995). మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజి పూర్వవిద్యార్థి. ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్ళి అక్కడే స్థిరపడి పరిశోధనలు సాగించినవాడు. పందొమ్మిదవ యేట ఓడమీద ఇంగ్లాండు వెళుతూ ఖగోళ శాస్త్ర సంబంధమైన విషయాలెన్నో అధ్యయనం చేశాడు.

1935 జనవరి 11 శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతం. ఇంగ్లండ్‌లో రాయల్ ఆస్ట్రనామికల్ సొసయిటీ (రాస్) సమావేశాలు జరుగుతున్నాయి. తన మిత్రుడు విలియం మాక్-క్రీ తో కలిసి ఇంపీరియల్ కాలేజి నుంచి బెర్లింగ్టన్ హౌస్‌వరకు నడిచి వచ్చిన చంద్రశేఖర్ మిత్రుడితో కలిసే టీ తాగాడు. తన పరిశోధనాపత్రాన్ని చదవడానికి వేదిక పైకి వెళ్ళాడు. అంతే! సభ తీవ్రమైన ఆలోచనలతో మునిగిపోయింది. ఇరవై నాలుగేళ్ళ భారతీయ యువకుడు తలలు పండిన భౌతిక-ఖగోళ శాస్త్రవేత్తలందరినీ మంత్రముగ్ధులను చేశాడు. ఒక సాధారణ వ్యక్తిగా వేదిక ఎక్కినవాడు, అసాధారణ పరిశోధకుడిగా వేదిక దిగాడు. ముఖంలో బాల్యపుఛాయలైనా వదలని ఆ యువకుడు కేంబ్రిడ్జి - ట్రినిటి కాలేజి ఫెలోషిప్‌కు ఎన్నికయ్యాడు. ఆ గౌరవం అప్పటికి 16 ఏళ్లకు ముందు భారత గణిత శాస్త్రజ్ఞుడు రామానుజన్‌కు దక్కింది. ఆ అవకాశాన్ని ఏమాత్రం దుర్వినియోగం చేయకుండా చంద్రశేఖర్ ఆకాశాన్నే తన ప్రయోగశాల చేసుకున్నాడు. సుదీర్ఘమైన పేరుతో పిలవలేక అందరూ అతణ్ణి 'చంద్ర' అని పిలుస్తూ ఉండేవారు. కొడుకు సాధిస్తున్న విజయాల్ని తెలుసుకుని చంద్ర తండ్రి సి.యస్.అయ్యర్ ఉబితబ్బిబ్బవుతూ ఉండేవారు. అప్పటి ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త సర్ ఆర్థర్ ఎడ్డింగ్టన్ చంద్ర పరిశోధనల్ని బహిరంగంగా ఎద్దేవా చేస్తుండేవాడు. కారణం జాతి విచక్షణ. 1930లో నోబెల్ బహుమతి సాధించిన భారతీయ శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యుడే. ఒకసారి చంద్ర స్వదేశం తిరిగి వచ్చినపుడు కలకత్తా వెళ్ళి అంకుల్ సి.వి.రామన్ని కలిసివచ్చాడు. ఆ సందర్భంలో రామన్ అన్నారట. "పుస్తకాలు రాయడానికి నాకు తీరికలేకుండా పోయింది. నాకు పరిశోధనలో ఉన్న ఉత్సాహం పుస్తకాలు రాయడంలోలేదు. అయినా కాంతి విచ్ఛేదనం మీద హెచ్.కబ్బెన్సెస్ పుస్తకం రాశాడట కదా? నేనింక రాయడమెందుకూ? అని మానుకున్నాను. నాకు నోబెల్ బహుమతి వచ్చింది. ఆయన పుస్తకం రాశాడు"-అని! అయితే నాకు నాలుగు నోబెల్ బహుమతులు తప్పిపోయాయి!"-అని అన్నాడట చంద్ర. "ఆ..ఆ.. నోబెల్ బహుమతి అంటే మజాకా కాదు. ఏమనుకున్నావో" అని సి.వి.రామన్, చంద్రశేఖర్‌ను బెదరగొట్టాడు. అప్పుడు వారి సంభాషణ అలా సాగినా, సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్‌కు నోబెల్ పురస్కారం తప్పిపోలేదు. 1983లో ఆ బహుమతిని చంద్ర విలయంఫౌలర్‌తో కలిసి స్వీకరించారు. ఒక విచిత్రమైన విషయమేమంటే చంద్రకు టి.డి.లీ, సి.యన్.యంగ్ అని ఇద్దరు సన్నిహితులైన విద్యార్థులు ఉండేవారు. వారికోసం ఆయన ఒక వందమైళ్ళు కారు ప్రయాణంచేసి - విస్కాన్‌సిస్‌లో సముద్రం దగ్గరలోఉన్న వెర్క్స్ అబ్జర్వేటరీ నుండి షికాగో యూనివర్సిటీకి వారం తప్పించి వారం వెళుతూ ఉండేవారు. వారితో చర్చిస్తూ వారికి తెలియని విషయాలెన్నో బోధిస్తూ ఉండేవారు. ఆ శిష్యులిద్దరికీ వయోలేషన్స్ ఆఫ్ ద ప్రిన్సిపల్ ఆఫ్ పార్టీకి 1957లో నోబెల్ బహుమతి లభించింది. వారికి పరిశోధనా రంగంలో మార్గదర్శి అయిన ఈ గురువు గారికి మాత్రం అదే బహుమతి రావడానికి ఇరవై ఆరేళ్ల పట్టింది. 1983లో నోబెల్ లారెట్‌కు గౌరవపూర్వకంగా ఇచ్చిన విందులో చంద్ర కొన్ని ఆసక్తికరమైన విషయాల్ని బయటపెట్టారు. 1970వ దశకంలో ఆయనకు రెండుసార్లు గుండెపోటు వచ్చింది. కొద్దిలో గండం గడిచి బయటపడ్డారు. అందుకే తనకు లభించిన నోబెల్ బహుమతి తన జీవితానికి కొనసాగింపు నిచ్చిన డాక్టరు చలువవల్ల వచ్చిందని ప్రకటించారు. ఆయన విశాల దృక్పథానికి, కృతజ్ఞతాభావానికి జేజేలు పలకాలి. ఏరు దాటాక తెప్ప తగలేసేలోకంలో చంద్రశేఖర్‌లాంటి వారు కూడా ఉన్నారన్నది గ్రహించాలి. గొప్పవాళ్ళు కేవలం వారుచేసిన కృషివల్ల మాత్రమే గొప్పవాళ్ళు కారు. వారి వ్యక్తిత్వంవల్ల కూడా అవుతారు. సీతాలక్ష్మి - చంద్రశేఖర సుబ్రహ్మణ్య అయ్యర్ (సి.యస్.అయ్యర్) దంపతులకు 19 అక్టోబర్ 1910 న బ్రిటీష్ ఇండియాలోని లాహోర్‌లో చంద్ర జన్మించారు. ఇప్పుడా నగరం పాకిస్థాన్‌లో ఉంది. ఈయన



తండ్రి రైల్వేలో డిప్యూటీ ఆడిటర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కాలంలో చంద్ర అక్కడ జన్మించారు. అసలైతే వారిది తమిళనాడుకు చెందిన కుటుంబం. లాహోర్ నుండి ఉద్యోగరీత్యా అలహాబాదుకుమారి, చివరికి ఆ కుటుంబం మద్రాసుకు చేరుకుంది. చంద్ర విద్యాభ్యాసం అక్కడే ప్రారంభమైంది. తల్లి సీతాలక్ష్మికి సాహిత్యం, లలిత కళలంటే మక్కువ. ఆమె ఆ రోజుల్లోనే హెన్రిక్ ఇబ్సన్ రచన 'ఎ డాల్స్ హౌస్' తమిళంలోకి అనువదించారు. బాల్యంలో చంద్రకు తమిళం నేర్పించేవారు. తండ్రి అయ్యర్ లెక్కలు చెప్పేవారు. తల్లి దండ్రులు చదువుకున్నవారై ఉండి, బాధ్యతగా పిల్లలకు చదువు చెప్పుకుంటే తప్పకుండా వారు భావిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే వారవుతారు. వీరినే మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు. చెన్నైలోని హిందూ హైస్కూలులో పాఠశాల చదువు పూర్తిచేసుకున్న చంద్ర, తర్వాత మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరారు. మంచి మార్కులతో ఉత్తీర్ణుడవుతూ ప్రతిభ కనబరిచి నందువల్ల నాటి బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించింది. దాంతో ఆయన ఇంగ్లాండు వెళ్ళి కేంబ్రిడ్జిలో ఉన్నతవిద్య నభ్యసించారు. పాలిట్రాఫిక్ డిస్ట్రిబ్యూషన్ అనే విషయంమీద 1933లో తన సిద్ధాంత గంథాన్ని ప్రకటించారు. ఈయన పరిశోధనకు గైడ్‌గా వ్యవహరించింది రోల్ఫ్ హెచ్. ఫౌలర్. సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ అంతవరకు ప్రకటించిన పరిశోధన పత్రాల ఆధారంగా అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయం ఆయనకు 1937లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం ఇచ్చింది. అక్కడ చేరకముందు కొంతకాలం ఆయన అమెరికాలోని యెర్క్స్ అబ్సర్వేటరీలో పనిచేశారు. ఆకాలంలో ఆస్ట్రోఫిజికల్ రీసెర్చ్ జర్నల్‌కు సంపాదకత్వం కూడా నిర్వహించారు. తర్వాత మరికొంతకాలం బాలిస్టిక్ రీసర్చ్ లెబొరెటరీలోనూ పనిచేశారు. తర్వాత షికాగో యూనివర్సిటీలో సుదీర్ఘకాలం పనిచేస్తూ 84 వ యేట తుదిశ్వాస విడిచేవరకూ ఆ యూనివర్సిటీలోనే ఏదోఒక హోదాలో ఏదోఒక రీసర్చ్ ప్రాజెక్ట్ నిర్వహిస్తూ వచ్చారు. సెప్టెంబర్ 1974లో ఆయనను డాక్టర్లు బలవంతంగా ఆసుపత్రిలో విశ్రాంతికోసం ఉంచాల్సి వచ్చింది. అప్పుడు కూడా ఆయన సమయం వృథాచేయలేదు. షేక్స్‌పియర్‌ను క్షుణ్ణంగా చదివారు. హామ్లెట్- అభిమాని అయ్యారు. ఒక సంవత్సరం తర్వాత సెప్టెంబర్ 1975లో ఆయన సృజనాత్మకత మీద అద్భుతమైన ఉపన్యాసమిచ్చారు. షేక్స్‌పియర్ (సాహిత్యం) న్యూటన్ (సైన్సు) బెథోవెన్ (సంగీతం) లను ఉదహరిస్తూ సృజనాత్మకతలోని వైవిధ్యాన్ని విశ్లేషిస్తూ ఉంటే శ్రోతలు తన్మయులై విన్నారు. 1936లో సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ తన తోటి విద్యార్థిని అయిన లలితను పెళ్ళి చేసుకున్నారు. వారి దాంపత్యం ఆరు దశాబ్దాలపాటు సాగింది. కానీ, 1995 ఆగష్టు 21న లలిత ఒంటరిగా మిగిలిపోయింది. జీవితకాలంలో చంద్ర స్వీకరించిన అవార్డులకు లెక్కలేదు. ఎఫ్.ఆర్.యస్(1944) ఆడమ్స్ ప్రైజ్ (1948) రాయల్ మెడల్ (1962) పద్మ విభూషణ్ (1968) నోబెల్ ప్రైజ్ (1983) వంటివి ముఖ్యమైనవి. వైజ్ఞానికరంగంలో ఆయన కృషికి గుర్తుగా 18 విషయాలకు ఆయన పేరు పెట్టారు. చంద్రశేఖర్ లిమిట్, చంద్రశేఖర్ ఎక్స్‌రే అబ్సర్వేటరీ, చంద్ర, ఫిక్షన్, చంద్ర పోలరైజేషన్ వంటివి. ఆస్ట్రోఫిజిక్స్, జనరల్ రిలెటివిటీ, ఫ్లూయిడ్ డైనమిక్స్, రేడియేషన్ రంగాలలో ఆయన కృషిని తరువాతి తరాలు అధ్యయనం చేస్తున్నాయి. 'ఇండియాలో సైన్సు చెప్పడంకంటే జ్యోతిష్యం చెప్పడం నయం. నాలుగుడబ్బులైనా వస్తాయి ! అని అన్నాడొకాయన ! అందుకే కదా సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్‌లాగా నక్షత్రాల అధ్యయనం చేయడం మానేసి, ఎక్కువమంది జన్మనక్షత్రాలు చూసే జ్యోతిష్యులవుతున్నారూ? అదీకానివారు జ్యోతిష్యులు చెప్పేదివిని చెవులూపుతున్నారు. ఆలోచనలేని గొర్రెదాటుజనం ఎక్కువవడంవల్ల, గొర్రెలు తినేవాడిని తప్పించి, బర్రెలు తినేవాడికి రాజ్యాధికారం అందిస్తున్నారు. హేతుబద్ధతలేని సమాజాలు ఇదిగో ఇలాగే కొట్టుమిట్టాడుతూ, చచ్చి బతుకుతుంటాయి.

సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్

35 కిలోమీటర్లు రిక్షా తొక్కుతూ..

భద్రక్: గొడవల్లో గాయపడ్డ తన తండ్రిని రక్షించుకోవడానికి 14 ఏండ్ల బాలిక పెద్ద సాహసమే చేసింది. చికిత్స చేయించడానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేని దైన్య పరిస్థితుల్లో తండ్రిని రిక్షాలో ఎక్కించుకుని 35 కిలోమీటర్లు తొక్కి దవాఖానలో చేర్చింది. ఈ ఘటన ఒడిశాలోని భద్రక్‌లో ఈ నెల 23న చోటుచేసుకోగా, గురువారం వెలుగులోకి వచ్చింది. బాలిక తండ్రిని పరీక్షించిన డాక్టర్లు ఆపరేషన్ చేయాలని, వారం రోజుల తర్వాత రమ్మని పంపించేశారు. నాలుగు రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి రావడంతో భద్రక్ ఎమ్మెల్యే సాహిబ్ మాలిక్, మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర దాస్ వచ్చి తండ్రి చికిత్సకు అవసరమయ్యే సహాయాన్ని అందజేస్తామని హామీనిచ్చారు. తండ్రిని రక్షించుకోవడానికి బాలిక చేసిన సాహసాన్ని పలువురు ఈ సందర్భంగా అభినందించి, తగిన విధంగా ఆదుకుంటామని చెప్పారు.

20 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తాం

ముకేశ్ అంబానీకి బెదిరింపు

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీని చంపేస్తామని బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ-మెయిల్ ద్వారా ఓ వ్యక్తి బెదిరించాడు. తమకు 20 కోట్లు ఇవ్వకుంటే, చంపేస్తామని ఆ మెయిల్‌లో హెచ్చరించారు. తమ వద్ద బెస్ట్ షూటర్స్ కూడా ఉన్నట్లు ఆ మెయిల్‌లో తెలిపారు. షాదాబాద్ ఖాన్ పేరుతో ఉన్న మెయిల్ నుంచి శుక్రవారం ఈ బెదిరింపు వచ్చింది. ఆంటిలియాలోని అంబానీ నివాసానికి చెందిన సెక్యూర్టీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఫిర్యాదు నమోదు చేశారు. ముంబైలోని గామ్‌దేవి పోలీసులు ఐపీసీ 387, 502(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గతేడాది కూడా అంబానీ కుటుంబానికి ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. 2022 ఆగస్టు 15వ తేదీన ఒక వ్యక్తి రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న హర్‌కిసాన్‌దాస్ ఆస్పత్రికి బెదిరింపు ఫోన్ చేసి ఆసుపత్రిని పేల్చేస్తామని, అంబానీ కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. 2021లో అంబానీ నివాసం ఆంటిలియా సమీపంలో పేలుడు పదార్థాలతో కూడిన ఓ స్కార్పియో కారును నిలిపి ఉంచడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

ఈ ఘటన జరిగిన వారం రోజులకే స్కార్పియో యజమాని మన్‌సుఖ్ హీరేన్ అనుమానాస్పద రీతిలో చనిపోయారు. ఈ కేసులను తొలుత ఇన్‌స్పెక్టర్ సచిన్ వాజే దర్యాప్తు చేపట్టగా తర్వాత ఆయనే ప్రధాన సూత్రధారిగా తేలడం గమనార్హం. దీంతో ఎన్ఐఏ అధికారులు ఆయనను అరెస్టు చేశారు. ఈ ఘటన తర్వాత నుంచి ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వమే భద్రత కల్పిస్తోంది.

ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురి ఆత్మహత్య

అహ్మదాబాద్: గుజరాత్‌లోని సూరత్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల్లో ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఆ ఇంటిలో సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక సమస్యల వల్ల ఈ కఠిన నిర్ణయం తీసుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. శనివారం ఉదయం అడాజన్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నుంచి దుర్వాసన రావడాన్ని పొరుగువారు గమనించారు. తలుపుతట్టి, బెల్ మోగించినప్పటికీ ఎవరూ స్పందించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూశారు. అందులో నివసిస్తున్న కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రహించారు. మృతులను 35 ఏళ్ల మనీశ్ సోలంకి, 32 ఏళ్ల భార్య రీటా, పిల్లలు ఏడేళ్ల దిశ, ఐదేళ్ల కావ్య, మూడేళ్ల ఖుషాల్, మనీశ్ తల్లిదండ్రులైన 65 ఏళ్ల కాంతిలాల్ సోలంకి, 60 ఏళ్ల శోభనగా గుర్తించారు. కుటుంబంలోని ఆరుగురు వ్యక్తులు విషం తాగి చనిపోగా మనీష్ ఉరి వేసుకున్నాడు. ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లుగా రాసి ఉన్న నోట్, విషం సీసాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఫర్నీచర్ వ్యాపారంతోపాటు కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న మనీశ్ సోలంకికి ఆ అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌లో నాలుగు ఫ్లాట్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చాలా కాలంగా కుటుంబంతో కలిసి ఉంటున్న ఆయన చాలా మందికి డబ్బులు అప్పుగా ఇచ్చినట్లు చెప్పారు. దీపావళి పండుగ సమీపిస్తున్నందున డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశాడని, వారు ఇవ్వకపోవడంతో తన కుటుంబ సభ్యులకు విషం ఇచ్చిన తర్వాత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. అయితే ఆ ఫ్యామిలీ సామూహిక ఆత్మహత్యకు కారణం ఏమిటన్న దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అసోం ముస్లిం నేత వివాదాస్పద వ్యాఖ్యలు

దిస్పూర్: నేరాల రేటులో ముస్లింలు అగ్రస్థానంలో ఉన్నారని ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) అధినేత బద్రుద్దీన్ అజ్మల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లూటీలు, దోపిడీలు, లైంగికదాడి వంటి నేరాలకు పాల్పడటంలో ముస్లింలది కొట్టినపిండని చెప్పారు. జైళ్లకు వెళ్లడంలో కూడా మనం నంబర్ వన్ అని వ్యాఖ్యానించారు. చదువు లేకపోవడంతోనే ముస్లింలు అధికంగా నేరాలకు పాల్పడుతున్నారని తేల్చారు. ఈ వ్యాఖ్యలపై అసోంలో తీవ్ర దుమారమే రేగింది. పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తున్నప్పటికీ ఆయన తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. తానేమే తప్పుగా మాట్లాడలేదని సమర్థించుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు విద్యకు దూరంగా ఉండటం తాను చూశానన్నారు. ఉన్నత విద్య అటుంచితే కనీసం మెట్రిక్యులేషన్ కూడా పూర్తి చేయలేకపోతున్నారని తెలిపారు. ఈ కారణంగానే నేరాల రేటు అధికంగా ఉందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలను చూసినపుడు తమ కుటుంబాల్లో కూడా మహిళలు ఉన్నారని యువకులు గుర్తుంచుకోవాలని సూచించారు. వారు తమ తల్లులు, సోదరీమణుల గురించి ఆలోచిస్తే లైంగికవేధింపులకు పాల్పడరని పేర్కొన్నారు. ముస్లిం యువత విద్య, ఉపాధికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. యువత చదువుకోవాలనే ఉద్దేశంతోనే తాను అలా అన్నానని సమర్థించుకున్నారు. కాగా, అసోంలోని ప్రధాన రాజకీయ పార్టీల్లో ఏఐఈడీఎఫ్ ఒకటి. రాష్ట్రంలోని 126 అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీకి 15 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు

జమ్ములో అకారణ కాల్పులపై పాకిస్తాన్‌కు నిరసన తెలిపిన బీఎస్ఎఫ్

జమ్ము : ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న సైనిక స్థావరాలు, గ్రామాలపై ఇటీవల అకారణంగా కాల్పులు, మోర్టార్ షెల్లింగ్ దాడులు జరపడంపై సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) శనివారం పాకిస్తాన్ రేంజర్లకు తీవ్ర నిరసన తెలియజేసినట్లు అధికారులు తెలిపారు. 2021 తర్వాత జరిగిన మొదటి అతిపెద్ద కాల్పుల విరమణ ఉల్లంఘన పాకిస్తాన్ రేంజర్ల క్రాస్ బోర్డర్ షెల్లింగ్, ఆర్ఎస్ పురా సెక్టార్‌లోని ఆర్నియా ప్రాంతంలో గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ప్రారంభమైంది. సుమారు ఏడు గంటల పాటు కొనసాగింది. ఒక బీఎస్ఎఫ్ జవాన్, ఒక మహిళ గాయపడ్డారు. సుచేత్‌గఢ్‌లోని బోర్డర్ అవుట్‌పోస్ట్ ఆక్ట్రాయ్‌లో జరిగిన కమాండర్ స్థాయి సమావేశంలో ఈ నిరసనను తెలియజేసినట్లు బీఎస్ఎఫ్ అధికారి ఒకరు తెలిపారు

గవర్నర్ సందేహాలు నివృత్తి చేశాం

సహకార సవరణ బిల్లుపై కేరళ మంత్రి వెల్లడి

కొట్టాయం : కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఇటీవల ఆమోదించిన కేరళ కో-ఆపరేటివ్ సొసైటీల (సవరణ) బిల్లుకు తాజా సవరణలకు సంబంధించి గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ లేవనెత్తిన ప్రశ్నలకు సమగ్రంగా స్పందించినట్లు కేరళ ప్రభుత్వం శనివారం తెలిపింది. బిల్లు చుట్టూ ఉన్న అనిశ్చితి ఇప్పుడు స్పష్టమైందని రాష్ట్ర సహకార శాఖ మంత్రి వి.ఎన్.వాసవన్ పేర్కొన్నారు. 'గవర్నర్ త్వరలో బిల్లును ఆమోదించే అవకాశం ఉంది' అని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు. సహకార రంగంలో సమగ్ర పునరుద్ధరణే లక్ష్యంగా రాష్ట్ర అసెంబ్లీ బిల్లును ఆమోదించిందని మంత్రి తెలిపారు. ఇటీవల రాష్ట్ర సహకార రంగాన్ని దెబ్బతీసిన కోట్ల రూపాయల కరువన్నూర్ బ్యాంకు కుంభకోణం నేపథ్యంలో డిపాజిట్లకు మరింత భద్రత కల్పించేందుకు కేరళ అసెంబ్లీ గత నెలలో బిల్లును ఆమోదించింది. అనంతరం బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపారు. బృంద తనిఖీ, కాల పరిమితితో సహా సవరణలోని వివిధ అంశాలకు సంబంధించి తనకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గవర్నర్ ఖాన్ సహకార శాఖ నుంచి వివరణ కోరారు.

మరణించిన కుమారుడి ఆస్తిలో తల్లికీ వాటా

కర్నాటక హైకోర్టు స్పష్టీకరణ

బెంగళూరు: చనిపోయిన కుమారుడి వారసత్వ ఆస్తికి తల్లికూడా వాటాదారు అవుతుందని కర్నాటక హైకోర్టు స్పష్టం చేసింది. మరణించిన తన కుమారుడి ఆస్తిలో తల్లికి వాటా ఉండదంటూ ఒక జిల్లా ప్రధాన సెషన్స్ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ టీఎస్ సుశీలమ్మ అనే మహిళ హైకోర్టులో వేసిన దావాను జస్టిస్ హెచ్‌పీ సందేశ్ విచారించారు. చిక్కమగళూరుకు చెందిన ఆమె కుమారుడు సంతోష్ మరణించే సమయానికే వారసత్వంగా వచ్చిన ఆస్తిలో ఆమెకు వాటా లభించిందని ఉన్నత న్యాయస్థానంలో డిఫెన్స్ న్యాయవాది వాదించారు. ఆ వాదనలను న్యాయమూర్తి తోసిపుచ్చారు. దిగువ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు లోపభూయిష్టంగా ఉన్నాయని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అర్జీదారుకి భర్త ఉన్నప్పటికీ, హిందూ వారసత్వ చట్టం ప్రకారం కుమారుడి ఆస్తిలో ఆమెకూ వాటా దక్కుతుందని, ఆస్తిలో తల్లికీ సమాన హక్కు ఉంటుందన్న అంశాలను దిగువ న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదని జస్టిస్ సందేశ్ పేర్కొన్నారు.

ఎన్నికల పర్వంలో కోటీశ్వరులు!

- చత్తీస్‌గఢ్ బరిలో 46 మంది
- అగ్రస్థానంలో రూ.40 కోట్ల ఆస్తులతో ఆప్ అభ్యర్థి

రాయ్‌పూర్ : చట్టసభలకు జరిగే ఎన్నికల పర్వంలో నానాటికీ కోటీశ్వరుల హవా పెరిగిపోతోంది. తాజాగా ఐదు రాష్ట్రాలకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో వీరి సంఖ్యే అధికంగా ఉంది. చత్తీస్‌గఢ్ అసెంబ్లీ మొదటి దశ ఎన్నికల్లో 46 మంది 'కోటీశ్వరులు' అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఖడ్గరాజ్ సింగ్ రూ.40 కోట్లకు పైగా ఆస్తులతో అగ్ర స్థానంలో ఉన్నారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), ఎలక్షన్ వాచ్ నివేదిక ప్రకారం, మొదటి దశ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి సగటు ఆస్తులు రూ.1.34 కోట్లు. నవంబర్ 7న జరగనున్న తొలి విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్న 223 మంది అభ్యర్థుల్లో 46 మంది కోటీశ్వరులేనని నివేదిక పేర్కొంది. ప్రధాన పార్టీలలో 20 మంది బీజేపీ అభ్యర్థులకు ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తులు రూ.5.33 కోట్లుగా విశ్లేషించగా, 20 మంది కాంగ్రెస్ అభ్యర్థులు రూ.5.27 కోట్లతో, 10 మంది ఆప్ అభ్యర్థులు రూ.4.45 కోట్లు, 15 మంది జనతా కాంగ్రెస్ చత్తీస్‌గఢ్ (జె) అభ్యర్థులు రూ.30.54 లక్షలు అని తెలిపింది. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20 నియోజకవర్గాలకు నవంబరు 7 మొదటి దశలో పోలింగ్ జరగనుంది. మిగిలిన 70 నియోజకవర్గాలకు నవంబరు 17న పోలింగ్ ఉంటుంది. నివేదిక ప్రకారం, అత్యధికంగా ప్రకటించిన ఆస్తులు కలిగిన మొదటి ముగ్గురు అభ్యర్థుల్లో ఆప్‌కు చెందిన ఖడ్గరాజ్ సింగ్ ఉన్నారు. ఈయన కవార్ధా స్థానం నుంచి రూ.40 కోట్లకు పైగా ఆస్తులు కలిగిన మాజీ రాజకుటుంబానికి వారసుడు. ఆ తర్వాత పండరియా స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి భావా బోహ్రా (రూ.33 కోట్లు) ఉండగా, కాంగ్రెస్‌కు చెందిన జతీన్ జైస్వాల్ (రూ.16 కోట్లు) జగదల్‌పూర్ నుంచి పోటీ చేస్తున్నారు. అత్యల్ప ఆస్తులు కలిగిన ముగ్గురు అభ్యర్థులు డోంగర్‌ఘర్ (ఎస్సీ) స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న హేమ్ కుమార్ సత్నామి (రూ.8,000), అంతగఢ్ (ఎస్టీ) స్థానం నుంచి బరిలో ఉన్న భారతీయ శక్తి చేతన పార్టీకి చెందిన నర్హర్ డియో గావ్డే (రూ.10,000), రాజ్‌గావ్ నుంచి పోటీ చేస్తున్న రిపబ్లికన్ పార్టీ (ఖోర్పియా) అభ్యర్థి ప్రతిమా (రూ.10,000) ఉన్నారని నివేదిక పేర్కొంది. కాంకేర్ (ఎస్టీ) స్థానం నుంచి ఆజాద్ జనతా పార్టీకి చెందిన పార్వతి తేట, మొహ్లా-మన్పూర్ (ఎస్టీ) నుంచి జేసీసీ (జే) అభ్యర్థి నగేష్ పురం సున్నా ఆస్తులు ప్రకటించారని వెల్లడించింది. కాంగ్రెస్‌కు చెందిన మహ్మద్ అక్బర్ (క్వార్ధా సీటు), మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ అభ్యర్థి రమణ్ సింగ్ (రాజ్‌నంద్‌గావ్), విక్రాంత్ సింగ్ (ఖైరాఘర్) ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్)లో అధిక ఆదాయాన్ని ప్రకటించిన మొదటి ముగ్గురు అభ్యర్థులుగా ఉన్నారు. ఐటీఆర్‌లో అక్బర్ మొత్తం రూ.1 కోటి కంటే ఎక్కువ ఆదాయాన్ని (తన, జీవిత భాగస్వామి, ఆధారపడిన వారితో సహా) చూపించారని, విక్రాంత్ సింగ్ (రూ.63 లక్షలు), రమణ్ సింగ్ (రూ. 55 లక్షలు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. 223 మంది అభ్యర్థుల్లో 115 మంది (52 శాతం) తమ విద్యార్హతలను ఐదు, 12 తరగతుల మధ్య ఉన్నట్లు ప్రకటించగా, 97 (43 శాతం) అభ్యర్థులు గ్రాడ్యుయేట్లు లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి ఉన్నట్లు పేర్కొనగా, ఐదుగురు డిప్లొమా హోల్డర్లుగా, నలుగురు తమను తాము కేవలం అక్షరాస్యులుగా ప్రకటించుకున్నారు. ఒక అభ్యర్థిని నిరక్షరాస్యుడిగా ప్రకటించగా, ఒకరు అతని విద్యార్హతను పేర్కొనలేదని తెలిపింది. మొదటి దశ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి ముగ్గురు సహా 25 మంది (11 శాతం) మహిళా అభ్యర్థులు పోటీ పడుతున్నారని నివేదిక వెల్లడించింది.

రూ.4.16 కోట్ల ప్రభుత్వ నిధుల దోపిడీ

- నీటి ప్రాజెక్టుల పేరుతో నకిలీ కార్యాలయం ఏర్పాటు
- గుజరాత్‌లో ఇద్దరి అరెస్ట్

ఛోటా ఉదయ్‌పూర్ : గుజరాత్‌లోని గిరిజనులు అధికంగా ఉండే ఛోటా ఉదయ్‌పూర్ జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నకిలీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి గత రెండేళ్లలో రూ.4.16 కోట్ల ప్రభుత్వ గ్రాంట్లు పొందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం, నిందితుడు సందీప్ రాజ్‌పుత్ బోగస్ ప్రాజెక్టుల కోసం రూ.4.16 కోట్ల విలువైన ప్రభుత్వ నిధులు పొందడానికి బోడేలిలో నీటిపారుదల ప్రాజెక్టు విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు చెందిన నకిలీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. దీని కోసం 2021-2022, 2022-2023లో ప్రతిపాద నలు ఆమోదించారు. రాజ్‌పుత్, అతని సహచరుడు ప్రభుత్వ కాంట్రాక్టర్ అబూ-బకర్ సైయాద్‌ను అక్టోబరు 27న అరెస్టు చేసి 12 రోజుల పోలీసు కస్టడీకి తరలించినట్లు అధికారి తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ప్రకారం, కొన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.3.75 కోట్లు కావాలని నకిలీ కార్యాలయం నుంచి వచ్చిన ప్రతిపాదనపై ప్రాజెక్టు నిర్వాహక కార్యాలయం ఆరా తీయగా విషయం వెలుగులోకి వచ్చింది. నీటిపారుదల శాఖకు చెందిన విశ్వసనీయ అధికారుల ద్వారా సంబంధిత కార్యాలయం లేదని తెలిసింది. తదుపరి విచారణలో 2021-22, 2022-23లో రూ.1.97 కోట్లు రూ.2.18 కోట్ల విలువైన ప్రాజెక్టుల కోసం నకిలీ కార్యాలయం నుంచి ఇలాంటి ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. ఈ-చెల్లింపు పద్ధతిలో నిధులు విడుదలయ్యాయని ఎఫ్ఐఆర్ పేర్కొంది. రాజ్‌పుత్ జులై 2021లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి రూ.4.16 కోట్ల రాష్ట్రాన్ని మోసం చేసేందుకు తనను తాను ప్రభుత్వోద్యోగిగా పేర్కొన్నాడని, బహుశా ఈ నేరపూరిత కుట్రలో మాజీ లేదా ఇప్పటికే ఉన్న అధికారుల భాగస్వామ్యం ఉండి ఉంటుందని అధికారి తెలిపారు. ప్రతిపాదన పత్రాలు నిజమైనవిగా కనిపించేలా కార్యాలయంలో నకిలీ స్టాంపులు, నకిలీ సంతకాలను కూడా ఉపయోగించారని ఆయన చెప్పారు. వీరిద్దరిపై సెక్షన్ 170 (ప్రభుత్వాధికారిగా ఉన్నట్లు నటించడం), 419 (వ్యక్తిగతంగా మోసం చేయడం), భారతీయ శిక్షాస్మృతిలోని ఇతర సంబంధిత నిబంధనల కింద కేసు నమోదయింది. ఇదిలా ఉండగా, నకిలీ ప్రభుత్వ కార్యాలయం పేరుతో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణాల్లో 'అసలు సూత్రధారులు' పేర్లు బయటికి వచ్చేలా ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ గుజరాత్ విభాగం డిమాండ్ చేసింది. 'అనుమానం రాకుండా రెండేళ్లపాటు ఇలాంటి కుంభకోణం సాగదు. పెద్ద రాజకీయ వర్గం, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆశీర్వాదం లేకుండా ఇది సాధ్యం కాదు' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ దోషి అన్నారు.

రాజస్తాన్‌లో రూ.200 కోట్లకుపైగా విలువైన 'ఉచితాలు' స్వాధీనం

జైపూర్: రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. మూడు వారాల్లో సుమారు రూ.200 కోట్లకుపైగా ఎన్నికల ఉచితాలకు సంబంధించిన డబ్బు, మద్యం, బంగారు ఆభరణాలు వంటి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి రాజస్థాన్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఐజీ వికాస్ కుమార్ నేతృత్వంలో 12 మంది అధికారుల బృందాలతో 'స్టోర్మ్ క్లబ్'ను ఏర్పాటు చేశారు. రాజస్థాన్ వ్యాప్తంగా ఎన్నికలపై కట్టుదిట్టమైన నిఘా, ఎన్నికల ప్రచారంలో ఓటర్లు ప్రభావితం కాకుండా చూసేందుకు ఈ పోలీస్ బృందాలు ప్రయత్నిస్తున్నాయని ఐపీఎస్ అధికారి వికాస్ కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు రూ. 214 కోట్ల మేర ఎన్నికల ఉచితాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందులో రూ. 25 కోట్ల డబ్బు, రూ. 20 కోట్ల విలువైన మద్యం, రూ.20 కోట్ల విలువైన ఆభరణాలు ఉన్నాయని చెప్పారు. వీటికి సంబంధించి అనేక కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు రూ.60 కోట్ల విలువైన డ్రగ్స్, అక్రమంగా నిల్వ చేసిన ఆయుధాలు, పెట్రోల్, డీజిల్, ఎరువులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఐపీఎస్ అధికారి వికాస్ కుమార్ తెలిపారు. ఆపరేషన్ మోనాకో కింద రాజస్థాన్ వ్యాప్తంగా 650 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. పెద్ద సంఖ్యలో ఎన్నికల తాయిలాలను స్వాధీనం చేసుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు. వారికి రివార్డులు కూడా ప్రకటించారు.

'ఎగవేత కాలం'లోకి ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ

మోదీ పాలనపై ఖర్గే విమర్శలు



న్యూఢిల్లీ : ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి బకాయిలు పెరగడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం ప్రధాని నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వం భారతదేశ ఆర్థిక వ్యవస్థను 'ఎగవేత కాలంలో' కి తీసుకువెళుతోందని ఆరోపించారు. మార్చి 2019 నుంచి ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి రావాల్సిన బకాయి మొత్తం రోజుకు రూ.100 కోట్లకు పైగా పెరిగిందని ఖర్గే సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో మీడియా నివేదికను కూడా పంచుకున్నారు. 'నరేంద్ర మోదీ జీ, మీ ప్రభుత్వం భారతదేశ ఆర్థిక వ్యవస్థను 'ఎగవేతల కాలంలోకి' తీసుకెళుతోంది! 'ప్రభుత్వ ఆస్తులను' ఆశ్రితులకు పంచిపెట్టడం, సామాన్యుల పొదుపు సొమ్మును కూలగొట్టడం మాత్రమే మీ అజెండా' అని పేర్కొన్నారు. 2019 మార్చి నుంచి ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి బకాయిలు రోజుకు రూ.100 కోట్లు పెరిగాయనేది నిజం కాదా అని ఖర్గే ప్రశ్నించారు. గత 9 ఆర్థిక సంవత్సరాల్లో మీ ప్రభుత్వం రూ.14.56 లక్షల కోట్ల ఎన్‌పీఏలను రద్దు చేయలేదా?' అని అన్నారు. 'నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతా వంటి తీవ్రమైన ఆర్థిక నేరగాళ్లకు సహాయం చేయడంలో, భారతదేశం నుంచి దోపిడీ చేసి వారు పారిపోవడంలో మీ ప్రభుత్వం దోషిగా ఉంది' అని ఆయన విమర్శించారు. 'ధరల పెరుగుదల, సాధారణ ప్రజల పొదుపులను తగ్గించడం, ఆర్థిక అసమానతలను సృష్టించడంలో కూడా మోదీ ప్రభుత్వం దోషిగా ఉంది' అని ఆయన అన్నారు. 'నిరాశలో ఉన్న రైతులు సహాయం కోసం అభ్యర్థిస్తుంటే, బీజేపీ వారి రుణాలను మాఫీ చేయడానికి నిరాకరిస్తుంది. కానీ డబ్బున్న కుబేరులు మాఫీ చేయాలని కోరినప్పుడు, మీ ప్రభుత్వం క్షణాల్లో బాధ్యత వహిస్తుంది!' అని తెలిపారు. 2024కు రండి. మీరు ఆర్థిక వ్యవస్థపై చేసిన ప్రతి దాడికి భారతదేశ ప్రజలు సమాధానం ఇస్తారు!' అని ఖర్గే అన్నారు.

మణిపూర్ హింసాకాండ కేసు

నిందితుడి బెయిల్‌కు ఎన్ఐఏ వ్యతిరేకత

న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండ వెనుక అంతర్జాతీయ కుట్రలో ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి బెయిల్ పిటిషన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వ్యతిరేకించింది. నిందితుడు మొయిరంగ్థెమ్ ఆనంద్ సింగ్ నిషేధిత సంస్థలతో అనుబంధం కలిగి ఉన్నాడని, జాతి ఘర్షణలు కొనసాగుతున్న ప్రాంతంలో అతని సహచరులతో కలిసి అధునాతన ఆయుధాలు, మందుగుండు సామగ్రితో అరెస్టు చేసినట్లు అదనపు సెషన్స్ జడ్జి సచిన్ గుప్తా ముందు దర్యాప్తు సంస్థ వివరించింది.

మణిపూర్ రాష్ట్రంలోని ప్రస్తుత జాతి అశాంతిని ఉపయోగించుకుని భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి, ఉగ్రవాద దాడులను అమలు చేయడానికి ఈశాన్య భారత రాష్ట్రాల్లో క్రియాశీలంగా పని చేస్తున్న మయన్మార్‌కు చెందిన ఉగ్రవాద సంస్థల నాయకత్వం పన్నిన బహుళజాతి కుట్రలో నిందితుడు పాల్గొన్నాడు. ప్రస్తుత పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది' అని ఎన్ఐఏ కోర్టుకు తెలిపింది. నిందితుడు బెయిల్‌పై విడుదలైతే, అది కొనసాగుతున్న దర్యాప్తునకు ఇబ్బందిని కలిగిస్తుందని, నిందితుడి చరిత్రను పరిగణనలోకి తీసుకుంటే, రాష్ట్రంలో ప్రస్తుత శాంతిభద్రతలను మరింత తీవ్రతరం చేసే ఇలాంటి కార్యకలాపాలకు అతను మళ్లీ పాల్పడే అవకాశం ఎక్కువగా ఉందని పేర్కొంది. నవంబరు 8న ఈ పిటిషన్‌పై కోర్టు వాదనలు విననుంది.

నిందితుడిని అరెస్టు చేసిన తర్వాత న్యూఢిల్లీకి తీసుకువచ్చి సెప్టెంబరు 23న ఢిల్లీ కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. మే 3న మణిపూర్‌లో ప్రారంభమైన జాతి హింసలో 180 మందికి పైగా మరణించారు. అనేక వందల మంది గాయపడ్డారు.

రాజస్తాన్‌లో 21 మందితో ఆప్ రెండో జాబితా

న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల ఎన్నికల హడావిడి మొదలైంది. ఇందులో భాగంగానే ప్రధాన పార్టీలతోపాటు ఆప్ కూడా బరిలోకి దిగి తన సత్తా ఏంటో నిరూపించుకోవాలని ప్రయత్నిస్తోంది. రాజస్తాన్‌లో రెండురోజుల క్రితం అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. శనివారం 21 మంది అభ్యర్థులను ప్రకటిస్తూ రెండో జాబితాను ఆప్ విడుదల చేసింది. పార్టీ నేతలైన మనీశ్ శర్మ బికనీర్ వెస్ట్ నుంచి, ఝబర్ సింగ్ ఖీచర్ సికార్ నియోజకవర్గం నుంచి, విశ్వేందర్ సింగ్ రామ్‌గఢ్, ముఖేష్ భూప్రేమి.. సవారు మాధోపూర్ నియోజకవర్గం, రోహిత్ జోషిని జోధ్‌పూర్ నుంచి ఆప్ బరిలోకి దింపింది. పురాన్ మల్ ఖటిక్.. షాపురా నుంచి, రామేశ్వర్ ప్రసాద్ జంద్.. బస్సీ నుండి, అర్చిత్ గుప్తా.. సివిల్ లైన్స్ నుంచి పోటీ చేస్తున్నట్లు ఆప్ ప్రకటించింది. కాగా, కాంగ్రెస్ ఈరోజు (శనివారం) 19 అభ్యర్థుల మూడో జాబితాను విడుదల చేసింది. ఇప్పటివరకు కాంగ్రెస్ 95 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇక కాంగ్రెస్ ఈరోజు విడుదల చేసిన జాబితాలో ధోల్‌పూర్ నుంచి శోభారాణి కుష్వా, సికార్ నుంచి రాజేంద్ర ప్రతీక్, నగర్ నుంచి వాజీబ్ అలీ, డియోలీ-ఉనియారా నుంచి హరీశ్ చంద్ర మీనా, ఝలోద్ (ఎస్టీ) నుంచి హీరా లాల్ దరంగి, కరౌలీ నుంచి లఖన్ సింగ్ మీనాతోపాటు తదితరులను ప్రకటించింది.

36వ డివిజన్‌లో

విశాలాంధ్రలో

మానవీయ విలువలకు నిలువుటద్దం రాఘవాచారి

వర్ధంతి కార్యక్రమాల్లో రామకృష్ణ, ఆర్వీ రామారావ్

విశాలాంధ్ర-విజయవాడ:

మానవీయ విలువలు, ఉన్నత జీవిత విధానాలకు నిలువుటద్దం చక్రవర్తుల రాఘవాచారి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్ అన్నారు. విశాలాంధ్ర పూర్వ సంపాదకులు, సంపాదక శిఖరం రాఘవాచారి నాల్గవ వర్ధంతి కార్యక్రమం విజయవాడలోని విశాలాంధ్ర కేంద్ర కార్యాలయం చంద్రంబిల్డింగ్స్ లోనూ, విజయవాడ 36వ డివిజన్ శాఖ అధ్వర్యంలో ఐనాక్స్ థియేటర్ వద్ద శనివారం జరిగింది. ఐనాక్స్ థియేటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ, తన అక్షరాలతో సమాజ పురోభివృద్ధికి ఎంతో కృషి చేసిన సంపాదక శిఖరం చక్రవర్తుల రాఘవాచారి ఆశయాలను మనందరం ముందుకు తీసుకెళ్లాదామని అన్నారు. విజయవాడలో ఎక్కడ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల జరిగినా వాటిలో రాఘవాచారికి ప్రత్యేక స్థానం ఉండేదన్నారు. జర్నలిస్టులందరూ ఆయన వంశీకులుగా పరిగణించబడతారని చెప్పారు. జర్నలిస్టు యూనియన్ నాయకునిగా ఆయన జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. రాఘవాచారి చిత్రపటానికి రామకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు ఆధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని రామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రధాన కార్యాలయంలో రాఘవాచారి 4వ వర్ధంతి కార్యక్రమం ఎగ్జిక్యూటీవ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఆర్వీ రామారావ్ మాట్లాడుతూ అక్షర శస్త్రధారిగా పేరుగాంచిన రాఘవాచారి జీవితం నుంచి మనం నేర్చుకోవాల్సిన అంశాలు అనేకం ఉన్నాయని చెప్పారు. వృత్తి పరంగా ఆయనతో కలిసి చేసిన ప్రయాణంలో అనేక మెళకువులను, సామాజిక విషయాలను నేర్చుకున్నట్లు చెప్పారు. జాతీయ అంతర్జాతీయ రాజకీయ అంశాలను తన సంపాదకీయాల్లో సునిశితంగా విశ్లేషించారన్నారు. ఎన్నో అవకాశాలు వచ్చినా తను నమ్మిన సిద్ధాంతం కోసం విశాలాంధ్ర పత్రికలో సుదీర్ఘకాలం సంపాదకులుగా పని చేశారన్నారు. తెలుగు, ఇంగ్లీష్, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఆయన అనేక సాహిత్య వేదికలపై తనదైన శైలీలో మృదువైన సంభాషణలు చేశారని గుర్తు చేశారు. ఆదర్శవంతమైన రాఘవాచారి జీవితం విశేషాలు, నైతిక విలువలను, భాషా నైపుణ్యాలను తెలుసుకోవాలని సూచించారు. ముందుగా రాఘవాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీహెచ్ రాంబాబు, విశాలాంధ్ర న్యూస్ ఎడిటర్ ఎం.మురళీకృష్ణ, చీఫ్ ఆఫ్ బ్యూరో చావా రవి, సీనియర్ జర్నలిస్టు టీవీ సుబ్బయ్య, బి. మీనా వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొని రాఘవాచారికి నివాళులర్పించారు.

మేమొస్తే అందరికీ ఉచిత విద్య

- కేజీ నుంచి పీజీ వరకు పైసా చెల్లించక్కర్లేదు
- టెండు ఆకుల సేకరణదారులకు ఏటా రూ.4వేలు
- చత్తీస్‌గఢ్ ప్రజలకు రాహుల్ హామీలు

రాయ్‌పూర్:

చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేజీ నుంచి పీజీ వరకు విద్యను ఉచితంగా అందిస్తామని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. రూపాయి చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ బడులు, కళాశాలల్లో ఉచితంగా విద్యను అభ్యసించే అవకాశాన్ని కిండర్ గార్టెన్ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయి వరకు కల్పిస్తామని హామీనిచ్చారు. అలాగే 'టెండు' ఆకులు సేకరించేవారికి రాజీవ్ గాంధీ ప్రోత్సాహన్ యోజన కింద ఏటా రూ.4వేలు ఇస్తామని వాగ్దానం చేశారు. కంకర్ జిల్లా, భానుప్రతాప్ పూర్ నియోజకవర్గంలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ర్యాలీలో రాహుల్ ఈ హామీలు ఇచ్చారు. భాను ప్రతాప్‌పూర్ గిరిజన ప్రాంతం కావడంతో కాంగ్రెస్ తాజా హామీకి ప్రాధాన్యత సంతరించుకుంది. రాహుల్ ప్రసంగిస్తూ ప్రధాని మోదీ తన ప్రసంగాల్లో ఓబీసీలను ప్రస్తావిస్తుంటారు కానీ కులగణన నిర్వహించేందుకు ఎందుకో భయపడుతుంటారని అన్నారు. తాము మోసపోయామని ఓబీసీలు గ్రహించారని చెప్పారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రాగానే జాతీయ స్థాయిలో కులగణన నిర్వహిస్తుందని, చత్తీస్‌గఢ్‌లో కులగణనకు ఇప్పటికే హామీనిచ్చామన్నారు. మోదీ ప్రభుత్వం కేవలం ముగ్గురు పారిశ్రామిక వేత్తల కోసం పనిచేస్తుంది కానీ కాంగ్రెస్ మాత్రం రైతులు, దళితులు, కార్మికులు, ఆదివాసీల కోసం పనిచేస్తుందని రాహుల్ ఉద్ఘాటించారు. గత ఎన్నికలప్పుడు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చినట్లు ప్రకటించారు. గిరిజనులను వనవాసీగా సంబోధించడం ద్వారా బీజేపీకి ఆదివాసీల సంస్కృతి, చరిత్ర, భాషపై ఏ మాత్రం గౌరవం ఉందో అర్థమవుతోందని రాహుల్ వ్యాఖ్యానించారు. మానవత్వం చాటుకున్న రాహుల్: వేదిక వద్ద ఒకరు స్పృహ కోల్పోగా వెంటనే స్పందించిన రాహుల్ తన ప్రసంగాన్ని ఆపేసి నీళ్ల బాటిల్‌తో ఆ వ్యక్తి వద్దకు వెళ్లారు. వారు బాగానే ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాతే తన ప్రసంగాన్ని కొనసాగించారు.

మా ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చలేదు: సిద్దరామయ్య

బెంగళూరు:

కర్నాటకలో ఆపరేషన్ కమలానికి తెరతీసి తమ ప్రభుత్వాన్ని కూల్చేయాలని బీజేపీ విఫలప్రయత్నం చేస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. బీజేపీ కుయుక్తులు కాంగ్రెస్ శాసనసభ్యుల వద్ద పనిచేయవన్నారు. 2019లో కాంగ్రెస్- జేడీఎస్ ప్రభుత్వం పడిపోవడానికి కారణమైన బృందమే ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుల వద్ద పైరవీలు మొదలు పెట్టిందని ఎమ్మెల్యే రవికుమార్ గౌడ ప్రకటించారు. రూ.50కోట్లు, మంత్రి పదవి వంటివి ఎర వేస్తోందన్నారు. ఇప్పటికే నలుగురిని సంప్రదించినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు వాటిని బయట పెడతామన్నారు. తాజా పరిణామంపై సిద్దరామయ్య స్పందిస్తూ బీజేపీ పప్పులు తమ ఎమ్మెల్యేల వద్ద ఉడకబోవని దీమాగా చెప్పారు.

ఛత్తీస్‌గడ్ ఎన్నికలకు సీపీఐ ఏపీ శాఖ విరాళం

విశాలాంధ్ర-విజయవాడ:

ఛత్తీస్‌గడ్‌లో జరగనున్న ఎన్నికల నిమిత్తం అక్కడి భారత కమ్యూనిస్టు పార్టీ కోసం సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి నుంచి విరాళాలు పంపించారు. స్థానిక దాసరి భవన్‌లో గత రెండు రోజులుగా సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు జరిగాయి. ఈ సమావేశానికి హాజరైన వారి నుంచి శనివారం విరాళాలుగా సేకరించిన మొత్తం రూ.21,450ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణకు అందజేశారు. అందజేసిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ఉన్నారు.

రాష్ట్రాల్లో విభేదాలున్నా లోక్‌సభకు ఐక్యంగానే పోటీ చేస్తాం: పవార్

ముంబై:

కొన్ని రాష్ట్రాల్లో విభేదాలు ఉన్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ప్రతిపక్షాలన్నీ ఒకేమాటపై ఉంటాయని ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తెలిపారు. ఆయన శనివారం ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'త్వరలోనే ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత పరిస్థితులు ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఏమైనా మార్పులు ఉంటాయో లేదో చెప్పే అధికారం నాకు లేదు. కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్ వంటి చాలా రాష్ట్రాల్లో బీజేపీకి అధికారం లేదు. ఎన్డీయేపై పోరులో విపక్ష పార్టీలు కలిసి ఉంటాయి. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కొన్నిచోట్ల అభిప్రాయ భేదాలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ కీలకంగా ఉన్నప్పటికీ అక్కడి ప్రాంతీయ పార్టీల బలాన్ని తోసిపుచ్చలేం. ప్రస్తుతం ఇదే సమస్యగా మారుతోంది. దీనిపై కూర్చొని చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. లోక్‌సభ ఎన్నికలకు పొత్తు కుదిరినట్లు రాష్ట్రాల్లో జరగడం సులువు కాదు' అని అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో జటిల పరిస్థితులు ఉన్నట్లు చెబుతూ బెంగాల్ టీఎంసీని పవార్ ఉదహరించారు. ఆ రాష్ట్రంలో వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీకి ఉన్న బలాన్ని తోసిపుచ్చలేమన్నారు. ఇండియా కూటమి విజయం దిశగా మరింత కసరత్తు జరగాల్సి ఉందని పవార్ నొక్కిచెప్పారు.

మహువా మొయిత్రా 2న హాజరుకావాలి

పొడిగింపును తోసిపుచ్చిన నైతిక విలువల కమిటీ

న్యూఢిల్లీ:

నగదుకు ప్రశ్నల వివాదానికి సంబంధించి 'మౌఖిక సాక్ష్యం' కోసం నవంబరు 2న తన ముందు హాజరుకావాలని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను శనివారం లోక్‌సభ నైతిక విలువల కమిటీ కోరింది. నవంబరు 5 వరకు గడువు ఇవ్వాలన్న మహువా అభ్యర్థనను తోసిపుచ్చింది. 'పార్లమెంటు, దాని సభ్యుల గౌరవంపై ప్రభావం ఉంటుంది. విషయం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏ కారణంతోనైనా పొడిగింపు కోసం తదుపరి అభ్యర్థనను స్వీకరించబోమని బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోంకర్ నేతృత్వంలోని కమిటీ మొయిత్రాకు స్పష్టం చేసింది. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతున్న కమిటీకి ఆమె శుక్రవారం లేఖ రాస్తూ, షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 31న తాను హాజరు కాలేనని, నవంబరు 5 తర్వాత మాత్రమే అందుబాటులో ఉంటానని తెలియజేశారు, 'నైతిక విలువల కమిటీ ముందు హాజరు కావడానికి తేదీని పొడిగించాలనే మీ అభ్యర్థనను కమిటీ చైర్‌పర్సన్ అంగీకరించారు. అంటే, నవంబరు 2న వ్యక్తిగతంగా మీ మాట వినడానికి కమిటీ సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేయడం జరిగింది' అని లోక్‌సభ సచివాలయం శనివారం ఆమెకు తెలిపింది.

బీజేపీకి గెలుపు దూరమే!

రాయ్‌పూర్:

చత్తీస్‌గఢ్ ఏర్పాటయిన నాటి నుంచి బీజేపీ ఇంకా విజయం సాధించని తొమ్మిది అసెంబ్లీ స్థానాలు మిగిలే ఉన్నాయి. రాష్ట్రాన్ని 15 ఏళ్లుగా బీజేపీ పరిపాలించింది. అయితే 2000లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తొమ్మిది నియోజకవర్గాల్లో ఎన్నడూ విజయం నమోదు చేయలేకపోయింది. ఈ పరిస్థితి తొలగిపోతుందనే ఆశతో పార్టీ వీటిలో ఆరు స్థానాలకు కొత్త ముఖాలను ఎంపిక చేసింది. చత్తీస్‌గఢ్‌లో నవంబరు 7, 17 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. ఈ తొమ్మిది స్థానాలు... సీతాపూర్, పాలి-తనఖర్, మార్వాహి, మోహ్లా-మన్పూర్ మరియు కొంటా షెడ్యూల్డ్ తెగల వర్గానికి రిజర్వ్ చేయబడ్డాయి, మిగిలిన నాలుగు... ఖర్సియా, కోర్బా, కోటా, జైజైపూర్ సాధారణ నియోజకవర్గాలు. చత్తీస్‌గఢ్‌ను మధ్య ప్రదేశ్ నుంచి విభజించిన తర్వాత, 2003, 2008, 2013లో వరుసగా మూడు అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ వరుసగా 50, 50, 49 స్థానాలను కైవసం చేసుకుంది. 2018లో 90 మంది సభ్యుల అసెంబ్లీలో 68 సీట్లను కాంగ్రెస్ గెలుచుకోవడం ద్వారా రమణ్ సింగ్ ప్రభుత్వ విజయాన్ని అడ్డుకుంది. దీంతో బీజేపీ సంఖ్య 15కు పడిపోయింది. 'బీజేపీ ఎన్నడూ గెలవని స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించింది. అభ్యర్థులందరూ తమ తమ ప్రాంతాలలో పూర్తి ఉత్సాహంతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి భారీ మద్దతు పొందుతున్నారు' అని ఎంపీ, పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ కన్వీనర్ సంతోష్ పాండే శుక్రవారం పీటీఐకి తెలిపారు. బస్తర్ ప్రాంతం నుంచి కాంగ్రెస్ గిరిజన నాయకుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి కవాసీ లఖ్మా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. మావోయిస్టు ప్రభావిత కొంటా సీటులో 1998 నుంచి ఓడిపోలేదు. అయితే బీజేపీ తాజా ముఖాన్ని 2011లో రద్దయిన మావోయిస్టు వ్యతిరేక సివిల్ మిలీషియా సల్వాజుడుం మాజీ కార్యకర్త సోయం ముక్కాను రంగంలోకి దించింది. ఈ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో లఖ్మాకు 31,933 ఓట్లు రాగా, బీజేపీకి చెందిన ధనిరామ్ బార్సే, సీపీఐకి చెందిన మనీష్ కుంజమ్ వరుసగా 25,224 ఓట్లు, 24,549 ఓట్లు సాధించారు. సర్గుజా డివిజన్ నుంచి కాంగ్రెస్‌కు చెందిన మరో ప్రభావవంతమైన గిరిజన నాయకుడు, భూపేష్ బఘేల్ ప్రభుత్వంలో మంత్రి అయిన అమర్జీత్ భగత్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సీతాపూర్ నియోజకవర్గం నుంచి విజయం సాధిస్తున్నారు. ఇటీవలే కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) కు రాజీనామా చేసి కాషాయ పార్టీలో చేరిన రామ్ కుమార్ టోప్పో (33) ను ఈ సీతాపూర్ నుంచి బీజేపీ బరిలోకి దించింది. ఫోన్‌లో పీటీఐతో మాట్లాడిన టోప్పో, సీతాపూర్ ప్రజలు తనను ఎన్నికల్లో పోటీ చేయమని 'ఒత్తిడి' తీసుకువచ్చారని, తాను భగత్‌ను సవాలుగా చూడడం లేదని అన్నారు. 'రాజకీయ నాయకుడిని అవుతానని నేనెప్పుడూ ఊహించలేదు. సీతాపూర్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై నా సహాయం కోరుతూ, ఎన్నికల్లో పోటీ చేయమని కోరుతూ నాకు దాదాపు 15 వేల లేఖలు వచ్చాయి. లైంగిక దోపిడీకి గురైన బాధితురాలు రక్తంతో రాసిన లేఖ ఒకటి ఉంది. నేను వాటిని విస్మరించలేను' అని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిని తాను సవాలుగా చూడడం లేదని, ఎందుకంటే అతనికి (భగత్) వ్యతిరేకంగా నేను కాదు... సీతాపూర్ ప్రజలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు' అని అన్నారు. అదేవిధంగా, కాంగ్రెస్ ప్రభుత్వంలోని మరో మంత్రి ఉమేష్ పటేల్ కూడా ఖర్సియా స్థానం నుంచి వరుసగా మూడోసారి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి మాత్రమే కాదు. 1977లో మధ్య ప్రదేశ్‌లో భాగంగా ఆవిర్భవించినప్పటి నుంచి ఈ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. 2013లో బస్తర్‌లోని జీరామ్ వ్యాలీ నక్సల్స్ దాడిలో మరణించిన అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమేష్ పటేల్ తండ్రి నంద్ కుమార్ పటేల్ ఈ స్థానం నుంచి ఐదుసార్లు ఎన్నికయ్యారు. ఖర్సియా నుంచి బీజేపీ కొత్త ముఖమైన మహేశ్ సాహును బరిలోకి దింపింది. 2018లో జనతా కాంగ్రెస్ చత్తీస్‌గఢ్ (జె) రెండు నియోజకవర్గాలను గెలుచుకోవడానికి ముందు మార్వాహి, కోటా స్థానాలు కూడా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్నాయి. 2000లో చత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ మొదటి ముఖ్యమంత్రి అయిన జోగి 2001లో మార్వాహి నుంచి ఉప ఎన్నికలో గెలిచారు. తర్వాత 2003, 2008లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఈ స్థానాన్ని గెలుచుకున్నారు. 2013లో ఆయన కుమారుడు అమిత్ జోగి మార్వాహి నుంచి విజయవంతంగా పోటీ చేసి 2018లో అజిత్ జోగి ఇక్కడ నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన జేసీసీ (జే) టికెట్‌పై పోటీ చేసి విజయం సాధించారు. అయితే, 2020లో అజిత్ జోగి మరణంతో అవసరమైన ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఈ నియోజకవర్గాన్ని చేజిక్కించుకుంది. 2006లో కాంగ్రెస్ శాసనసభ్యుడు రాజేంద్ర ప్రసాద్ శుక్లా మరణానంతరం కోటాలో జరిగిన ఉప ఎన్నికలో అజిత్ జోగి భార్య రేణు జోగి విజయం సాధించారు. ఆమె తదనంతరం 2008, 2013 ఎన్నికలలో సీటును గెలుచుకున్నారు. 2018లో జేసీసీ (జే) అభ్యర్థిగా నాల్గవసారి గెలిచారు. బీజేపీ కొత్త ముఖాలు ప్రబల్ ప్రతాప్ సింగ్ జుదేవ్, ప్రణవ్ కుమార్ మార్పచ్చి వరుసగా కోట, మార్వాహి స్థానాల నుంచి పోటీకి నిలిపింది. జుదేవ్, భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ ప్రముఖుడు దివంగత సింగ్ జుదేవ్ కుమారుడు. కాగా, మార్పచ్చి భారత సైన్యంలో పని చేశారు. కాంగ్రెస్ మార్వాహి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కేకే ధ్రువ్‌ను, కోటా నుంచి చత్తీస్‌గఢ్ పర్యాటక బోర్డు చైర్మన్ అతల్ శ్రీవాస్తవను పోటీకి దింపింది. 2008లో డీలిమిటేషన్ తర్వాత ఉనికిలోకి వచ్చిన మరో నాలుగు స్థానాలు... కోర్బా, పాలి-తనఖర్, జైజైపూర్, మోహ్లా-మన్పూర్‌లలో బీజేపీ ఇంకా ఖాతా తెరవలేదు. బీజేపీ రామ్ దయాళ్‌ను నిలబెట్టిన పాలి-తనఖర్ సీటులో ఆసక్తికర పోరు నెలకొంది. రామ్ దయాళ్ 2018లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీకి తిరిగి వచ్చారు. 1998లో మార్వాహి స్థానం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా ఎన్నికయిన ఉకై కాంగ్రెస్ పార్టీలో చేరారు. చత్తీస్‌గఢ్ మొదటి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అసెంబ్లీలోకి అజిత్ జోగి ప్రవేశానికి మార్గం సుగమం చేసేలా ఆ స్థానాన్ని ఉకై ఖాళీ చేశారు. 1998లో మార్వాహి స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఉయికే, కాంగ్రెస్‌లో చేరారు. చత్తీస్‌గఢ్ మొదటి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అజిత్ జోగి అసెంబ్లీలో ప్రవేశానికి మార్గం సుగమం చేయడానికి తన స్థానాన్ని ఖాళీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా, 2003లో తనఖర్ (డిలిమిటేషన్ తర్వాత ఇది పాలి-తనఖర్‌గా మారింది) విజయం సాధించారు. ఆ తర్వాత 2008, 2013లో పాలి-తనఖర్ నుంచి ఉయికే గెలిచారు. ఆయన 2018లో తిరిగి బీజేపీలోకి వచ్చి పాలి-తనఖర్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడిపోయాడు. ఇక్కడ నుంచి ఉయికేని బీజేపీ తిరిగి ప్రతిపాదించింది. ఇక్కడ కాంగ్రెస్ తన సిట్టింగ్ ఎమ్మెల్యే మోహిత్ రామ్‌కు టికెట్ నిరాకరించింది. బదులుగా మహిళా అభ్యర్థి దులేశ్వరి సిదర్‌ను నిలబెట్టింది. బాఘెల్ ప్రభుత్వంలోని మరో మంత్రి జై సింగ్ అగర్వాల్ కోర్బా నియోజకవర్గంలో 2008 నుంచి ఓటమి ఎరుగని రీతిలో కొనసాగుతున్నారు. కోర్బా నుంచి అగర్వాల్‌పై బీజేపీ మాజీ ఎమ్మెల్యే లఖన్‌లాల్ దేవాంగన్‌ను బరిలోకి దింపింది. జైజైపూర్ (జంజ్‌గిర్-చంపా) ప్రస్తుతం రెండుసార్లు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) ఎమ్మెల్యే కేశవ్ చంద్ర చేతిలో ఉంది. కాంగ్రెస్ పార్టీ తన జిల్లా యువ జన అధ్యక్షుడు బాలేశ్వర్ సాహును, బీజేపీ జిల్లా విభాగం అధ్యక్షుడు కృష్ణకాంత్ చంద్రను రంగంలోకి దింపాయి మోహ్లా-మన్పూర్‌లో కాంగ్రెస్ తరపున ప్రస్తుత ఎమ్మెల్యే ఇంద్రషా మాండవి, మాజీ ఎమ్మెల్యే సంజీవ్ షా బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2008లో డీలిమిటేషన్ తర్వాత ఉనికిలోకి వచ్చిన రాయ్‌పూర్ సిటీ సౌత్, వైశాలి నగర్, బెల్తారా అనే మూడు స్థానాల్లో బీజేపీ వలె, కాంగ్రెస్ ఇంకా విజయం సాధించలేకపోయింది. రాయ్‌పూర్ సిటీ సౌత్ అనేది బీజేపీ ప్రభావవంతమైన నాయకుడు, మాజీ మంత్రి బ్రిజ్మోహన్ అగర్వాల్, ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న అర్బన్ నియోజకవర్గం. కాంగ్రెస్ తన మాజీ ఎమ్మెల్యే, రాయ్‌పూర్‌కు చెందిన ప్రముఖ దుధాధారి మఠానికి చెందిన మహంత్ రామ్ సుందర్ దాస్‌ను అగర్వాల్‌పై పోటీకి నిలిపింది. బీజేపీ ఎమ్మెల్యే విద్యారతన్ భాసిన్ మరణంతో వైశాలి నగర్ స్థానం ఖాళీగా ఉంది. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ రెండూ కొత్త ముఖాలు... రికేశ్ సేన్, ముఖేష్ చంద్రకర్‌ను వరుసగా నిలబెట్టాయి. బెల్తారాలో బీజేపీ తన సిట్టింగ్ ఎమ్మెల్యే రజనీష్ సింగ్‌కు టికెట్ నిరాకరించింది. కొత్త ముఖమైన సుశాంత్ శుక్లాను తీసుకువచ్చింది, అయితే కాంగ్రెస్ బిలాస్‌పూర్ గ్రామీణ విభాగం అధ్యక్షుడు విజయ్ కేశర్వాని అధికార పార్టీ అభ్యర్థిగా ఉన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కమ్యూనికేషన్ విభాగం అధ్యక్షుడిగా ఉన్న సుశీల్ ఆనంద్ శుక్లా మాట్లాడుతూ తమ పార్టీ ఈసారి బీజేపీ కంచు కోటలు అని పిలవబడే కొన్నింటిని విజయవంతంగా ఛేదిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యర్థి పార్టీ గతసారి గెలిచిన సీట్ల సంఖ్యను పొందేందుకు కూడా కష్టపడుతుందని శుక్లా అన్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ 68 సీట్లు గెలుచుకుని అఖండ విజయాన్ని నమోదు చేసి సునాయాసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ 15 స్థానాలకు తగ్గగా, జేసీసీ (జే), బీఎస్పీ వరుసగా 5, 2 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ బలం 71 కాగా, ఈసారి 75 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

కులగణన అవసరమే : ప్రియాంక

దామోహ్ (మధ్య ప్రదేశ్):

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా శనివారం మరోసారి కుల గణన కోసం పిలుపునిచ్చారు. దేశంలోని ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల కచ్చితమైన సంఖ్యను తెలుసుకోవడానికి ఈ కసరత్తు అవసరమని, తద్వారా వారికి ప్రయోజనాలను అందించేలా విధానాలను రూపొందించవచ్చని అన్నారు. మధ్య ప్రదేశ్‌లోని దామోహ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. 'కుల గణన అంటే ఏమిటి? దేశంలో ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) వర్గాల నుంచి ఎంత మంది ఉన్నారో తెలుసుకోవాలనుకుంటున్నాం. ప్రభుత్వానికి వారి కచ్చితమైన సంఖ్య తెలియకపోతే, వారికి ఎలా న్యాయం చేస్తుంది?' అని ఆమె ప్రశ్నించారు. బీహార్‌లో నిర్వహించిన కుల గణనలో రాష్ట్రంలో 84 శాతం ఓబీసీలు, దళితులు ఉన్నారని తేలిందని తెలిపారు. 'కానీ దేశంలోని ఉన్నత పదవులను పరిశీలిస్తే, అక్కడ వారికి (ఈ సంఘాలకు) ప్రాతినిధ్యం లేదని మీరు కనుగొంటారు. వీటిలో 90 శాతం స్థానాల్లో ఈ వర్గాల వారు లేరు. 84 శాతం మంది ప్రజలు ఈ వర్గం, అప్పుడు వారికి ప్రాతినిధ్యం ఇవ్వాలి' అని ఆమె అన్నారు. 'మేము కుల గణన గురించి మాట్లాడేటప్పుడు, వారు (బీజేపీ ప్రభుత్వం) పెద్ద పెద్ద కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, మౌనంగా ఉన్నారు' అని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం సమస్యలపై ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ మొదట ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) ను మూసివేసి తన స్నేహితులకు విక్రయించింది. తరువాత, అది నోట్ల రద్దును అమలు చేసింది. జీఎస్‌టీని అమలు చేసింది. దాని తరువాత కోవిడ్-19 మహమ్మారి... ఇవన్నీ దేశ ప్రజల వెన్నెముకను విరగ్గొట్టాయి' అని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు ఆర్థిక సహాయం అందించడం కోసం లాడ్లీ బెహనా యోజనను ప్రవేశపెట్టడాన్ని ఆమె విమర్శించారు. 'మీరు వారిని (మహిళలను) మూర్ఖులుగా పరిగణిస్తున్నారా, వారికి ఈ విషయాలన్నీ అర్థం కాలేదని భావిస్తున్నారా? గత 18 ఏళ్లుగా అధికారంలో ఉన్న వారు (బీజేపీ) ఏమి చేశారు?' అని ప్రియాంక ప్రశ్నించారు. గత మూడేళ్లలో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం 21 ఉద్యోగాలు మాత్రమే కల్పించిందని, వైద్యులు, పోలీసులతో సహా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో అభివృద్ధి లేకపోవడంతో ఉద్యోగాల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ప్రాంతం నుంచి వలస వెళ్లారని ఆమె చెప్పారు. ప్రజలు తమ హక్కుల కోసం పోరాడగలిగేలా అవగాహన పెంచుకోవాలని, వారి మంచి భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని గాంధీ ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అజయ్ టాండన్ ప్రచారానికి ఈ ర్యాలీ నిర్వహించారు. అధికార బీజేపీ ఈ స్థానం నుంచి మాజీ ఆర్థిక మంత్రి జయంత్ మలైయాను పోటీకి దింపింది.

వివాదాలరొచ్చులో బీహార్ విద్యాశాఖ

- ఉపాధ్యాయుల జీతాల్లో కోతలు
- 2,081 మందిపై విద్యాశాఖ చర్యలు: ఇదే జాబితాలో మరో 590
- 4 నెలల్లో 22 మంది సస్పెన్షన్
- మరో 49 పేర్లు సిఫార్సు

పాట్నా:

బీహార్ విద్యాశాఖ వివాదాలకు కేరాఫ్‌గా మారింది. ఇటీవల ప్రభుత్వ బడులకు రాని పిల్లల పేర్లను తొలగించి విమర్శలను ఎదుర్కొన్నది. తాజాగా 2,081 మంది టీచర్ల జీతాల్లో కోతలు విధించి మరో వివాదానికి తెరతీసింది. తనిఖీల సమయంలో పాఠశాలల్లో లేరన్న నెపంతో ఉపాధ్యాయుల వేతనాలలో కోతలు విధించింది. బోధనా నిబంధనలను అతిక్రమించారన్న కారణంగా 22 మందిని సస్పెండ్ చేసింది. ఇదంతా కేవలం నాలుగు నెలల వ్యవధిలో జరగడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు టీచర్ల నియామక నిబంధనలను ఉల్లంఘించరంటూ మరో 17 మందిపై వేటుకు విద్యా శాఖ సిఫార్సు చేసింది. పాఠశాలలకు గైర్హాజరయ్యారన్న కారణంగా 21,90,020 మంది విద్యార్థుల పూర్లను ప్రభుత్వ బడుల నుంచి తొలగించి నితీశ్ ప్రభుత్వం విమర్శలపాలైంది. ఇలా పేర్లు తొలగించిన వారిలో 10, 12వ తరగతి బోర్డు పరీక్షలు హాజరు కావాల్సిన వారు 2.66 లక్షల మంది ఉన్నారు. ఈ ఉత్తర్వుల ఉపసంహరణకు మిత్రపక్షాలతో పాటు విపక్షాల నుంచి డిమాండ్ వచ్చింది. నితీశ్ ప్రభుత్వం జులై నుంచి ప్రభుత్వ బడులపై నిఘా పెట్టింది. ఇదే క్రమంలో పాఠశాలల్లో తనిఖీలను విద్యాశాఖ ముమ్మరం చేసింది. ఈ క్రమంలో గత నాలుగు నెలల్లో 2,081 టీచర్ల వేతనాల్లో కోత పడగా మరో 590 మంది జీతాలను కోతవేయాలని విద్యాశాఖ సూచించింది. అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరు అయినందున వేతనాల్లో కోతలు విధిస్తూ ఆదేశాలిచ్చింది. అలాగే వివిధ నిబంధనలను అతిక్రమించిన 22 మందిపై విధుల్లో నుంచి తొలగించింది. ఇదే కారణంగా మరో 49 మంది పేర్లను సిఫార్సు చేసింది. బీహార్ స్కూలు టీచర్ల నియామకానికి సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించిన 17 మందిని విధుల్లో నుంచి తొలగించేందుకు సిఫార్సులను విద్యాశాఖ చేసినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు.

దీపావళి తర్వాత 'చావో-రేవో' ఉద్యమం

టీచర్లపై శాఖాపరమైన చర్యలను టెట్ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం కన్వీనర్ రాజు సింగ్ ఖండించారు. వేతనాల్లో కోతలు, సస్పెన్షన్, తొలగింపుల తదితర అన్ని రకాల ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఒప్పంద టీచర్లకు ప్రభుత్వ ఉపాధ్యాయుల హోదా కల్పించాలని కూడా డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారానికి దీపావళి వరకు డెడ్‌లైన్ విధించారు. గడువు దాటితే 'చావో-రేవో' ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాగా, 21,90,020 మంది పిల్లల పేర్లను బడుల్లో నుంచి తొలగించడం సబబు కాదని, ఈ మేరకు జారీ చేసిన శాఖాపరమైన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని నితీశ్ ప్రభుత్వానికి మిత్రపక్షమైన సీపీఐ(ఎంఎల్) ఎమ్మెల్యే సందీప్ సౌరవ్ సూచించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.